రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:19 (శనివారం సాయంత్రం) సహరీ: 4:44 (ఆదివారం ఉదయం)



జిల్లా పోలీసులకు ఉగాది పతకాలు


మురళీకృష్ణ ఏవీ సుబ్బరాజు అస్మా పర్వీన్

రాజమహేంద్రవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కారాలు-2025 సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన వివిధ సేవా పతకాల్లో జిల్లాలోని పోలీసు, ఫైర్, విజిలెన్స్, సీఐడీ, ఏపీ ఎస్పీఎఫ్ శాఖలకు పతకాల పంట పండింది. అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎన్‌బీఎం మురళీ కృష్ణకు మహోన్నత సేవా పతకం దక్కింది. అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు, సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మా పర్వీన్ సేవా పతకం సాధించా రు. ఏఆర్ ఎస్ఐ(902) జీవీ సత్యనారాయణ మూర్తి ఉత్తమ సేవా పతకం,డీసీఆర్‌బీ ఎస్ఐ ఎల్.కనకరాజు, ఏఆర్ ఎస్ఐ వీ.వెంకట గిరి(2968), ఏఆర్ హెచ్‌సీ(206) టి.సతీశ్ బాబు, ఉండ్రాజవరం ఏఎస్ఐ కె.రామకృష్ణ, చాగల్లు ఏఎస్ఐ వై.రాజేంద్రప్రసాద్, అనపర్తి హెచ్‌సీ పి.రఘు, బొమ్మూరు పీఎస్ పీసీ కేఎస్ సుబ్రహ్మణ్యం సేవా పతకం లభించింది.ఫైర్ సర్వీసు నుంచి రాజమహేంద్రవరం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మ్యాన్ పి.గణేశ్వరరావు, డ్రైవర్ ఆపరేటర్ ఎల్.దుర్గాప్రసాద్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలోని ఐవోపీ టి.నాగ వెంకట రాజు, ప్రత్యేక రక్షణ దళం నుంచి ఎయిర్‌పోర్టు ఏఎస్ఐ ఎం.శ్రీనివాస రెడ్డికి ఉత్తమ సేవా పతకం లభించాయి. ఓఎన్‌జీసీలో సీటీ (2215) కె.కృష్ణారావు, హెచ్‌సీ(1472) వై.రాజశేఖరానికి సేవా పతకం లభించాయి.

మురుగు..గోదారి!

భక్తజనం గోదావరిని ఎంతో ప్రత్యేకంగా చూస్తారు.. ఒక్కసారైనా ఆ నదిలో స్నానం చేయాలని ఎంతో మంది మొక్కుకుంటారు.. అంత పవిత్రమైనదిగా భావిస్తారు.. ఇప్పటికీ ఎక్కడెక్కడి నుంచో వచ్చిన భక్తజనం స్నానాలు ఆచరిస్తారు... అంతటి పవిత్రత ఉన్న గోదావరిని అపవిత్రం చేస్తున్నారు.. రాజమహేంద్రవరం నగరంలో వచ్చే మురుగంతా గోదావరిలోకి వదిలేస్తున్నారు.. నదీ పరీవాహక ప్రాంతంలో ఎక్కడ చూసినా.. పుష్కరఘాట్..కోటిలింగాల ఘాట్.. సరస్వతి ఘాట్.. గౌతమి ఘాట్.. ఇలా ఏ ఘాట్ చూసినా చెత్తతో దర్శనమిస్తోంది.. మరో వైపు భక్తితో నెత్తిపై నీళ్లు పోసుకుందామని దిగామా పైకి తేలేది బురదనీరే.. ఇక ధవళేశ్వరం వద్ద అయితే ఆవ కాలువకు చెందిన మురుగు బోదెను గోదావరిలోకి పెట్టేస్తున్నారు.. మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నద్ధం చేస్తోంది..ఇప్పటికైనా గోదావరిలో కలిసే మురుగునీరు దారి మళ్లించకపోతే ప్రమాదమే మరి.. నేడు అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరిపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్..

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం




ఆసుపత్రిలో సిబ్బందితో చర్చిస్తున్న అడిషనల్ డీఎంఈ వెంకటేశ్వరరావు

వైద్యులు డ్యూటీలకు సకాలంలో ఎందుకు రావడంలేదు?
బోధనాసుపత్రి తనిఖీలో ఏడీఎంఈ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు సకాలంలో డ్యూటీలకు రాకపోవడంపై డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్‌పేషెంట్ విభాగంతో పాటు కీలకమైన అన్ని విభాగాలను సందర్శించారు. వైద్యుల హాజరును పరిశీలించారు. ఆర్ఎంవో ప్రణవ్‌ను వెంటబెట్టుకుని ఆసుపత్రిలోని ఓపీ విభాగాలు, ఐసీయూలు, వార్డుల్లో తిరిగారు. కొంతమంది రోగులతోను మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. న్యూరో విభాగంలో సర్జరీలు ఎందుకు చేయడంలేదని ప్రశ్నించగా ఎక్విప్‌మెంట్ లేకపోవడం వల్ల సీరియస్ కేసులను కాకినాడ రిఫర్ చేయాల్సి వస్తోందని వివరించినట్టు తెలిసింది.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఉద్యోగులు ఈనెల 24, 25 తేదీల్లో జరపతలపెట్టిన సమ్మె వాయిదా పడింది.సెంట్రల్ లేబర్ కమిషనర్ శుక్రవారం వివిధ సమస్యలపై బ్యాంకు ఉద్యోగులతో జరిపిన చర్చల్లో సానుకూలత కనిపించడంతో సమ్మె వాయిదా వేసినట్టు బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మీపతిరావు, యూనియన్ నాయకులు శేషకుమార్, పాపారావు తెలిపారు. సోమ, మంగళవారం బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

మినరల్ వాటరే.. తాగండి పరవాలేదు.. ఇదీ ప్రస్తుతం ఎక్కడికి వెళ్లినా గ్లాసుతో నీళ్లిచ్చి ముందుగా చెప్పే మాట.. చాలామంది దృష్టిలో బయట నుంచి కొని టిన్నులతో తెచ్చుకుంది మినరల్ వాటర్ కింద లెక్క. ఆ నీరు ఎంత వరకూ సురక్షితమంటే కాస్త ఆలోచించాల్సిందే మరి.. ప్లాంట్ నీళ్లు తెచ్చుకున్నంత మాత్రాన సురక్షితం కాదు సుమా..! ఏదో మినరల్ వాటర్ తాగుతున్నామని పైకి చెప్పుకోవడం తప్ప.. బోరు వాటర్ కంటే అధ్వానమే మరి.. ఒకసారి మీరు మంచినీళ్లు తెచ్చుకునే ప్లాంట్‌కు అని అనుమతులు ఉన్నాయో లేదో చూస్కోండి.. లేదంటే మీ ఆరోగ్యం గోవిందా!?



సుజలమేనా!
నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నారు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మినరల్ వాటర్ అనుకుంటూ లీటరు రూ.20 పెట్టికొంటున్నాం. మినరల్స్ మాట దేవుడెరుగు.. అసలు అవి సురక్షిత తాగునీరేనా? అంటే ఆలోచించాల్సిందే. కలుషిత నీటి వల్ల వివిధ రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నా యంత్రాంగం ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. దీంతో వాటర్ ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సరైన పర్యవేక్షణ.. నియంత్రణ లేక మామూలు నీటిని నింపేసి నీళ్లలా డబ్బును దోచేస్తున్నారు. ప్యాకెజ్డ్, ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ రంగం వేల కోట్ల రూపాయల వ్యాపారమైపోయింది. నేడు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా వాటర్ ప్లాంట్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

పుట్టగొడుగుల్లా..

తాగునీరు ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్) ప్రమాణాల ప్రకారం ఉండాల్సిందే. కానీ వాటర్ ప్లాంట్ల విషయంలో అది అమలుకావడం లేదు. వాటర్ ప్లాంటు పెట్టాలంటే బోరుకు వాల్టా చట్ట ప్రకారం స్థానిక సంస్థలు తదితర అనుమతులు ఉండాలి. నీరు శుద్ధి చేసిన తర్వాత ప్యాకెట్లు, బాటిళ్లలో ప్యాక్ చేసి విక్రయించాలంటే కచ్చితంగా ఐఎస్ఐ ఉండాలి. ప్రభుత్వ అధికారులు వచ్చి ల్యాబ్‌తో సహా ఉన్నాయా లేదా అనేది పూర్తిగా తనిఖీలు చేస్తారు. నమూనాలను మైక్రో బయాలజీ ల్యాబ్‌లకు పంపించి పరిశీలిస్తారు. ఇది తీసుకున్న తర్వాత ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికెట్ ఇస్తారు. ఇవి ఉంటేగానీ ప్యాక్ చేసి అమ్మడానికి వీల్లేదు. ఐఎస్ఐ లైసెన్స్‌కి ఏడాదికి రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం చాలా మంది వాటర్ ప్లాంట్ల యజమానులు నిబంధనలకు నీళ్లొదిలేశారు. లూజ్ వాటర్ పేరుతో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, నాసిరకం వాటర్ ప్యాకెట్లలో నీటిని నింపి విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం లూజ్ వాటర్‌కి ఐఎస్ఐ10500 ప్రకారం నాణ్యతా ప్రమాణాలు ఉండాలి. వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లప్లాస్టిక్‌లో నాణ్యతా ప్రమాణాలూ పాటించడం లేదు. చాలా ప్యాకెట్లలో నీరు ప్లాస్టిక్ వాసన వస్తుంటుంది. ఐఎస్ఐ కలిగిన బ్రాండెడ్ కంపెనీల లీటరు వాటరు బాటిల్ రూ.12-14 ఉంటే, నాసిరకం రూ.7-8కే దొరుకుతుంది. లాభం ఎక్కువగా వస్తుందనే కక్కుర్తితో నాసిరకం నీటినే అధికశాతం అమ్మకాలు సాగిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐఎస్ సర్టిఫికెట్ కలిగినవి కేవలం 10 వరకూ ఉంటే, లేనివి 3 వేల పైమాటే. అసలు ఎన్ని వాటర్ ప్లాంట్లు ఎక్కడెక్కడ ఉన్నాయనే లెక్క యంత్రాంగం వద్ద లేకపోవడం గమనార్హం.



తాగునీటి ప్రమాణాలివే..

తాగునీరు కచ్చితంగా ఐఎస్ఐ ప్రమాణాలకు లోబడి ఉండాల్సిందే.ప్యాకెజ్డ్ తాగునీరు ఐఎస్ఐ 14543 ప్రమాణాలు పాటించాలి. టీడీఎస్ సున్నా నుంచి 500 వరకూ ఉండాలి. మినరల్ వాటర్ ఐఎస్ఐ 13428 ప్రమాణాలతో టీడీఎస్ 150- 500 ఉండాలి. నాచురల్ డ్రింకింగ్ వాటర్ ఐఎస్ఐ10500 ప్రమాణాలు కలిగి టీడీఎస్ 0-2 వేలు వరకూ ఉండొచ్చు. ఏదైనా పీహెచ్ మాత్రం 6 కంటే తక్కువ 8.5 కంటే ఎక్కువ ఉండరాదు. టీడీఎస్ అనేది ప్రాంతాలను బట్టి మారుతుంటుంది. గోదావరి నీటిలో 150 ఉంటే, కృష్ణా నీటిలో 350 వరకూ ఉంటుంది. వర్షం నీటిలో అసలు టీడీఎస్ ఉండదు. ఆమ్ల గుణం ఉంటుంది. బోరు నీటిలో టీడీఎస్ 10 నుంచి 15 వేల వరకూ ఉంటుంది. రివర్స్ ఓస్మాసిస్ ప్రక్రియ అనేది టీడీఎస్ తగ్గించడానికి చేస్తారు. దీని వల్ల 50% నీరు వృథా కావడంతోపాటు అవసరమైన లవణాలు పోతాయి. దాంతో లవణాలు కలిపి మినరల్ వాటర్‌గా అమ్ముతారు. అల్ట్రా వయోలెట్, అల్ట్రా ఫిల్టరేషన్ ప్రక్రియ ద్వారా బ్యాక్టీరియా మాత్రమే నశిస్తుంది.

నేడు జల దినోత్సవం

తాగునీటి ప్రాముఖ్యత, వినియోగమే ఉద్దేశంగా 1993 నుంచీ మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 2030 నాటికి సురక్షిత తాగునీరు, పారిశుధ్య రంగాల్లో సుస్థిర అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే దీని లక్ష్యంగా అమలు చేస్తున్నారు. 'హిమానీ నదం సంరక్షణ' థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

- మినరల్ పేరిట మోసం
- ప్యాకెట్లు.. బాటిళ్లతో సరఫరా
- పుట్టగొడుగుల్లా ప్లాంట్లు
- ఉమ్మడి జిల్లాలో 3 వేలు పైనే
- కనీస నిబంధనలూ కరువే
- ఐఎస్ఐ ప్రమాణాలు గాలికి
- జనం ఆరోగ్యంతో జలగాటం
- కన్నెత్తి చూడని అధికారులు
- మామూళ్ల మత్తు

మనమే పరీక్షించుకోవచ్చు..?

మనం తాగేనీటిలో మెగ్నీషియం, కాల్షియం, సోడియం, పొటాషియం, ఇనుము, రాగి, జింక్ వంటివి కలిసిపోయి ఉంటాయి. వీటన్నింటినీ కలిపి మొత్తం కలిగి ఉన్న లవణాలు లేదా టోటల్ డిసాల్వుడు సాలిడ్స్ (టీడీఎస్) అంటారు. టీడీఎస్‌తోపాటు పీహెచ్ స్థాయిలను బట్టి ఆ నీళ్ల మనం తాగొచ్చా లేదా అనేది నిర్ధారిస్తారు. టీడీఎస్ ఎక్కువగా ఉన్నా, పీహెచ్ స్థాయి 6 కంటే తక్కువగా 8.5 కంటే ఎక్కువగా ఉంటే రోగాల బారిన పడడం ఖాయం. టీడీఎస్, పీహెచ్ మీటర్లు బయట మార్కెట్లో దొరుకుతాయి. వాటితో మనం తాగేనీరు పరీక్షించవచ్చు.

నీళ్లు తాగితే.. రోగాలే?

నిర్ధారిత ప్రమాణాల ప్రకారం లేని నీటిని తాగితే రోగాల బారిన పడక తప్పదు. తాగు నీటిలో బ్యాక్టీరియా, వైరస్‌లు ఉండకూడదు. పీహెచ్ 6 కంటే తక్కువ 8.5 కంటే ఎక్కువ ఉండొద్దు. టీడీఎస్ కూడా అత్యధికంగా 2 వేలకు మించరాదు. అలా లేకపోతే అల్సర్లు, ఎసిడిటీ, అజీర్తి, ఉదర సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రిక్, మోకాళ్ల నొప్పులు వంటివి వస్తాయి.



కేసులు.. జరిమానాలు

మిస్ బ్రాండింగ్ అంటే లేబుల్‌పై ప్రచురించిన ప్రకారం ఉండకపోతే రూ.3 లక్షల వరకూ జరిమానా విధిస్తారు. పీహెచ్ విలువ నిర్ధారించిన దానికంటే తక్కువగా ఉంటే రూ. 5 లక్షల వరకూ జరిమానా వేస్తారు. అన్‌సేఫ్.. అంటే ప్రజల ఆరోగ్యానికి హానికరం అని తేలితే కోర్టులో కేసు వేస్తారు. విచారణలో నేరం రుజువైతే రూ.5 లక్షల వరకూ జరిమానా లేదా 6 నెలల జైలు లేదా రెండూ విధించే అవకాశం ఉంది.

ఫామ్ పాండ్స్ తీర్చిదిద్దాలి
కలెక్టర్‌తో డిప్యూటీ సీఎం పవన్

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఫామ్ పాండ్స్ (వ్యవసాయ చెరువులు) పంట సంజీవినిగా తీర్దిదిద్దాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి పల్లె పండుగ పనుల పురోగతిపై శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫామ్ పాండ్స్ పనులకు శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టడంపై ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన 1500 లక్ష్యాలను సాధించేందుకు ఇప్పటి వరకు 894 (59.53 శాతం) యూనిట్లకు పరిపాలనా ఆమోదం కోసం మంజూరు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన లక్ష్యాలు సాధించేందుకు క్షేత్ర స్థాయి అధికారులు తగిన ప్రతిపాదనలు అందజేయాలన్నారు. జూన్ నెలాఖరు నాటికి జిల్లాకి నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు పగడ్బందీ కార్యాచరణ అందజేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మరో 80 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.



బైండోవర్ కేసులు పెంచాలి
ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

రాజమహేంద్రవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బైండోవర్ కేసుల సంఖ్యను పెంచాలని డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. ఉత్తర, దక్షిణ ఎక్సైజ్ స్టేషన్లను శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సారా, బెల్ట్ షాపులు, గంజాయి కేసుల గురించి ఆరాతీశారు. సారా రహిత గ్రామాలపై చర్చించారు. నవోదయం 2.0, సారా అరికట్టడంపై సూచనలు చేశారు. గంజాయి తదితర నిషేధిత మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించే దిశగా చర్యలు వేగ వంతం చేయాలని, నేరాలు అదుపుచేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు.


తిరుమల శ్రీనివాస మెడికల్ ఏజెన్సీలో తనిఖీలు చేసి.. ట్రమడోల్ ఇంజక్షన్ల బాక్సు చూపుతున్న విజిలెన్స్ ఎస్పీ స్నేహిత

మెడికల్ షాపులపై విజిలెన్స్
జిల్లాలో 16 చోట్ల దాడులు చేసిన విజిలెన్స్ ఎస్పీ స్నేహిత

రాజమహేంద్రవరం, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శుక్రవారం మందుల షాపులపై అధికారులు దాడులు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈగల్ టీమ్, డ్రగ్ కంట్రోలు డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. నార్కోటిక్ మందులు (మత్తు మందులు) విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎం.స్నేహిత దాడులు చేసినట్టు డ్రగ్స్ కంట్రోలు డిపార్ట్‌మెంట్ రాజమహేంద్రవరం ఏడీ డి.నాగమణి తెలిపారు. కొన్ని మందుల షాపుల్లో నార్కోటిక్(ఎన్ఆర్ఎక్స్- మత్తు) మందులు బిల్లులు లేకుండా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించడం గమనించామని,ఆ మందుల షాపులపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని తిరుమల శ్రీనివాసా మెడికల్ ఏజెన్సీలో ట్రమడోల్ ఇంజక్షన్లు గుర్తించారు. అక్కడి లెక్కల ప్రకారం 1000 ఉండాలి.. కానీ 250 అమ్మేశారు. ఎవరికి అమ్మారు, ఎలా అమ్మారో వివరాలు లేవు. దీనిపై విచారణ చేస్తామని ఎస్పీ ఎం.స్నేహిత తెలిపారు. పద్మజ మెడికల్ ఏజెన్సీ, లైఫ్ మెకికల్ స్టోర్, సాయి మెడికల్ ఏజెన్సీల్లో దాడులు జరిగాయి. జిల్లా లో 16 చోట్ల దాడులు నిర్వహించారు. పలు చోట్ల మత్తు మందులు దొరికినట్టు తెలిసింది. రాత్రి కూడా దాడులు నిర్వహిస్తున్నారు.

రూ.10 లక్షల డ్వాక్రా సొమ్ము గోల్‌మాల్


17న డీఆర్‌డీఏ పీడీకి సమస్యను విన్నవిస్తున్న కడియపులంకకు చెందిన డ్వాక్రా మహిళలు

- కడియపులంకలో ఘటన
- 20 నెలలు కాజేసిన వీవోఏ
- గతేడాది విచారణ.. తేలిన వైనం
- బ్యాంకుకు కట్టాలని డిమాండ్
- కలెక్టర్‌కు సభ్యుల విన్నపం

కడియం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కడియపులంకలో ఒక డ్వాక్రా గ్రూపునకు సంబంధించి రూ.10 లక్షలు అవకతవకలు జరిగినట్టు సభ్యులు ఆరోపిస్తున్నారు. శాంతిశ్రీ సంఘం, సాయిమణికంఠ గ్రూపుగా 10 మంది సభ్యులు ఏర్పాటు చేసుకున్నారు. 2022 సంవత్సరంలో బ్యాంకు నుంచి తీసుకున్న డ్వాక్రా రుణ వాయిదా చెల్లింపులు వీవోఏ నాగవేణి నెలకూ రూ.50 వేలు చొప్పున 20 నెలల పాటు రూ.10 లక్షలు తీసుకుంది. దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ చేసి రూ.10 లక్షలు అవకతవకలు జరిగినట్టు గుర్తించినట్టు సభ్యులు చెబుతున్నారు.అనంతరం కదలిక లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ నెల 17వ తేదీన మరో మారు కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.ఇదిలా ఉండగా వీవోఏ నాగవేణి వద్ద ఉన్నప్పుడు డబ్బులు కడుతుంది అం దుకు మీరు అంగీకరిస్తూ కాగితాలపై సంతకాలు పెట్టండంటూ ఏపీఎం నాగలక్ష్మి తమపై ఒత్తిడి తెస్తున్నారని సంఘ అధ్యక్షురాలు ప్రగడరెడ్డి ఉమాదనేశ్వరి, సెక్రటరీ కోలా వీరలక్ష్మి, సంఘం సభ్యులు తెలిపారు.రూ.10 లక్షలు వెంటనే బ్యాంకుకు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

రూ.10 లక్షలు పక్కదారి పట్టించారు : ప్రగడరెడ్డి ఉమాధనేశ్వరి



ప్రతి నెలా రూ. 50 వేలు చొప్పున 20 నెలల పాటు చెల్లించాం. మేము ఇచ్చిన సొమ్ములు బ్యాంకుకు జమ కాలేదు. ఏడాది కిందట జరిగిన విచారణలో సుమారు రూ.10 లక్షలు అవకతవకలు జరిగినట్టు అధికారులు గుర్తించారు.అయినా నేటి వరకూ మా సొమ్ములు మాకు ఇప్పించలేదు.

రేపు ఎఫ్ఎల్ఎన్ఏటీ టెస్ట్

రాజమహేంద్రవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఎల్ఎన్ఏటీ)ని 143 కేంద్రాల్లో ఈ నెల 23న నిర్వహి స్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు ఎన్‌వీవీఎస్.మూర్తి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో తూర్పుగోదావరిలో గత నవంబరు నుంచి స్వయం సహాయక సంఘాల్లో చదువు కోని మహిళలకు అదే బృందంలో చదువుకున్న వారితో చదువు చెప్పించడం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకూ 509 మంది ఆధ్వర్యంలో 5,087 మంది అభ్యాసకులకు శిక్షణ తరగతులు నిర్వ హించామని చెప్పారు.వారు ఏ మాత్రం పురోగతి సాధించారనే అంచనా కోసం ఈ టెస్ట్ పెడుతున్నారన్నారు.ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తిస్తూ జాతీయ సాక్షరత విద్యాసంస్థ అధికారిక ధ్రువీకరణ పత్రం అందజేస్తుందన్నారు.

నేటి నుంచి నిర్మలగిరి ఉత్సవాలు 8
31 మంది ఏఎస్ఐలకు పదోన్నతి 7

మిద్దెపై బుజ్జి తోట!











ఆలమూరు మండలం జొన్నాడలో మిద్దె తోటల సాగు.. (పైన) పదేళ్ల బోన్సాయ్.. (కింద) సపోటా

గృహిణి బి.మాధవి.. (పైన) వాటర్ బాటిళ్లతో అందంగా..

- మిద్దె సాగులో జొన్నాడ గృహిణి నూతన ఒరవడి
- వ్యర్థాలకు అందమైన రూపు
- మొక్కలపై మమకారమే కారణమంటున్న మాధవి

(ఆలమూరు- ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యకరమైన కూరగాయలు, మధుర ఫలాలను అందించే రకరకాల పండ్ల మొక్కలు, రంగురంగుల పూలమొక్కలు, స్వచ్ఛమైన గాలిని అందించే చెట్లు... వీటితో మిద్దె తోటలను సృష్టించారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన గృహిణి బి.మాధవి. కొంచెం అభిరుచి, ఇంకొంచెం ఆలోచన, మరికొంచెం ఓపిక ఉంటే చాలు ఇంటిని హరిత నందనవనంలా మార్చేయ వచ్చని నిరూపించారామె. ఇందుకు వ్యర్థాలనే అర్థవంతంగా వాడడం మరో ప్రత్యేకత. ప్రస్తుత కాలంలో పీల్చేగాలి, తాగేనీరు తినే ఆహారం... ఇలా ప్రతీదీ కలుషితమై, రసాయనాలతో నిండిపోయి తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని అధిగమించడానికి ఆమె ఇంటి మేడపైనే సాగుకు శ్రీకారం చుట్టారు.

500 రకాల మొక్కలు

ఇంటి డాబాపై ఉన్న కొద్దిపాటి స్థలంలోనే దాదాపు 500 రకాల మొక్కలను పెంచుతున్నారు. ఈ అందమైన తోటకు మాధవి ముద్దుగా 'మా బుజ్జి తోట' అని నామకరణం చేసుకున్నారు. ఫలాలు అందించే మొక్కలు, పరిమళాలు వెదజల్లే పూలమొక్కలు, ఆరోగ్యాన్ని అందించే ఔషధ మొక్కలు, ఇంట్లో తినడానికి కూరగాయలు, ఆకుకూరలు... ఇలా అనేక రకాలు పెంచుతున్నారామె. ఏదైనా కొత్తగా చేయాలంటే చదువుకున్న వారికి మంచి ఆలోచనలు వస్తాయని అంటుంటారు. అయితే హరిత నందనవనం పెంచుతున్న మాధవి కేవలం ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. మొక్కలపై ఉన్న మమకారంతో పదేళ్ల కిందట ప్రారంభించి నేడు వందల సంఖ్యలో మొక్కలను పెంచి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. భర్త సాయిబాబు ప్రోత్సాహంతో ఇన్ని రకాల మొక్కలను పెంచుతున్నట్టు మాధవి చెప్పారు. తనకు ఏరువాక శాస్త్రవేత్తల గుర్తింపు లభించిందని ఆనందం వ్యక్తంచేశారు.

పనికిరాని వస్తువులతో అద్భుతాలు

ఇంట్లో పనికిరాని వస్తువులను మనం బయట పడేస్తుంటాం. అయితే మాధవి మాత్రం వాటినే పెట్టుబడిగా పెట్టి కొత్త ఆలోచనతో వాటిని అందంగా తయారుచేసి వాటిలో మొక్కల పెంపకం చేస్తున్నారు. వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్ బాటిల్స్, వాటర్ టిన్స్ ప్లాస్టిక్ డబ్బాలు, పనికిరాకుండాపోయిన ఫ్రిజ్, గ్రైండర్.. ఇలా అనేక రకాలను మొక్కల పెంపకానికి ఉపయోగిస్తున్నారు.

సేంద్రియ ఎరువుల తయారీ

ఇంట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలు, వాడి పాడేసిన టీపొడి, కుళ్లిపోయిన కూరగాయలతోపాటు కూరగాయలు, ఉల్లిపాయలు పైతొక్కలను నిల్వచేసి ఎరువుగా మార్చి వాటిని మొక్కలకు అందిస్తున్నారు. ఇంట్లో నిల్వ ఉండి పాడైపోయిన పిండి పదార్థాలను నీటిలో కలిపి నిల్వ చేయడం ద్వారా వాటిని మొక్కలకు వేస్తే బలంగా పెరుగుతాయన్నారు.

చీడపీడల నివారణ

మొక్కలు అనేటప్పటికి చీడపీడల బెడద ఉంటుంది. పొగాకు కాడలు ఉపయోగించి వాటిని నివారిస్తున్నామని ఆమె చెప్పారు. వేపను కూడా ఉపయోగిస్తున్నామని తెలిపారు.

మంచు.. టెండ..



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో ఉదయంపూట పొలాలపై కురుస్తున్న మంచు



అమలాపురంలో ద్విచక్రవాహనంపై ముసుగుతో యువతి


రోజంతా ఎండ.. రాత్రినుంచి తెల్లవారు జాము వరకు మంచు. ఇది ఉమ్మడి జిల్లాలో పరిస్థితి. జనం ఎండనుంచి రక్షణకు ముసుగులతో ఇలా ప్రయాణాలు చేస్తున్నారు.



కాకినాడలో స్కూటీపై స్కార్ఫ్ కట్టుకుని వెళ్తున్న యువతి

ఉభయ తారకంగా..

సీలేరు కాంప్లెక్స్



- అటు జలవిద్యుత్ ఉత్పత్తిలోను భేష్
- ఇటు గోదావరిడెల్టాకు నీటివిడుదల
- జలవిద్యుదుత్పత్తిలో నెల రోజుల ముందే లక్ష్యాన్ని అధిగమించిన మూడు విద్యుత్ కేంద్రాలు
- రబీ సీజన్‌లో 10 నుంచి 15 టీఎంసీల వరకు గోదావరి డెల్టాకు నీరు

మోతుగూడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలవిద్యుత్ కేంద్రాల్లో మూడు కేంద్రాలు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించిన గడువు కంటే ముందుగానే అధిగమించి రికార్డు నెలకొల్పాయి. కాంప్లెక్స్ పరిధిలో మాచ్‌ఖండ్, ఎగువసీలేరు, డొంకరాయి, పొల్లూరు నాలుగు జలవిద్యుత్ కేంద్రాలు ఉండగా ఒక్క మాచ్‌ఖండ్ మినహా మిగతా మూడు కేంద్రాలు లక్ష్యాలను నెలరోజుల కంటే ముందే పూర్తి చేశాయి.

సీలేరు కాంప్లెక్సులోని 2024-25 సంవత్సరానికి సెంట్రల్ విద్యుత్ అథారిటీ వారు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి 1084 మిలియన్ యూనిట్లు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రానికి 85 మిలియన్ యూనిట్లు, ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రానికి 477 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం మొదటిగా జనవరిలోనే అంటే రెండు నెలలు ముందేఅధిగమించి రికార్డు నెలకొల్పింది. ఎగువ సీలేరు, పొల్లూరు రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఫిబ్రవరి నెలాఖరు నాటికి టార్గెట్‌నే పూర్తిచేశాయి. నెలరోజులు ముందుగానే టార్గెట్‌లను పూర్తి చేసి రికార్డులను నెలకొల్పాయి. మార్చి 16నాటికి సీలేరు కాంప్లెక్స్‌లోని నాలుగు జలవిద్యుత్ కేంద్రాల్లో 2305 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశారు. సీలేరు కాంప్లెక్స్ జలాశయాలు అన్నింటికీ మార్చి 31 నాటికి సెంట్రల్ విద్యుత్ అథారిటీ నిర్దేశించిన టార్గెట్ 2286 మిలయన్ యూనిట్లు కాగా మార్చి 16నాటికి 2305 మిలియన్ యూనిట్లు ఉత్పత్తిచేసి 29మిలియన్ యూనిట్లు అధికంగా చేసి రికార్డు నెలకొల్పింది.

రబీకి నీటి విడుదల

సీలేరు కాంప్లెక్స్‌లో రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు పంచడమే కాకుండా గోదావరి డెల్టాకు రబీ పంటలకు నీటిని సరఫరా చేయడంలో కీలకమైన భూమిక పోషిస్తోంది. రబీ సీజన్‌లో గోదావరి డెల్టాలకు సీలేరు నీరే ప్రధానం. ప్రతిఏటా రబీ సీజన్‌లో సీలేరునుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం కొంతనీరు విడుదల కాగా, రబీ పంటల అవసరాల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు ప్రతిఏటా 10నుంచి 15 టీఎంసీల వరకు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది రబీ పంటలకు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు, జెన్‌కో అధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయం నుంచి నేరుగా 3వేల క్యూసెక్కులు ఒకసారి, మరో 4,300 క్యూసెక్కులనుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం కొంతనీరు మరోసారి విడుదల చేస్తున్నారు. రబీ పంటల అవసరాల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు ప్రతిఏటా 10నుంచి 15 టీఎంసీల వరకు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది రబీకి ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో అధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయంనుంచి రెండు దఫాలుగా నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకు 9టీఎంసీల నీటిని విడుదల చేశామని, నీటి విడుదలను మార్చి 31వరకు పొడిగించామని జెన్‌కో అధికారులు తెలిపారు. సీలేరు కాంప్లెక్సు విద్యుత్‌ఉత్పత్తిలోనే కాకుండా రబీలో గోదావరి డెల్టాకు నీటి విడుదల చేస్తూ బహుళార్థక సాధక ప్రాజెక్టుగా పేరు గాంచింది.

వ్యాపారం, రాజకీయం డబ్బున్న వాళ్లే చేస్తే

మనం దేనికోసం పుట్టాం

- ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ టి.శివశంకరరావు
- ఐడియల్ కళాశాలలో గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఇండియాపై జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకరరావు

కాకినాడ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వ్యాపారం, రాజకీయం డబ్బున్న వాళ్లేచేస్తే మిగతా జనం దేనికోసం పుట్టినట్లని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర రావు అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడీయల్ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్, కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాల ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈలు గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా అనే అంశంపై రెండురోజుల పాటూ నిర్వహించే జాతీయస్థాయి సదస్సును టి.శివశంకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ ఈ సదస్సుకు అధ్యక్షత వహించగా శివశంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలు, అభివృద్ధి విషయంలో ప్రజల భాగస్వామ్యం కీలకమవుతున్నదని సీఎం నారా చంద్రబాబునాయుడు తరచూ చెబుతున్నారని ఇలాంటి సదస్సులు అందుకు తోడ్పడతాయన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా పెట్టుబడిలేనివాళ్లు కూడా సంపద సృష్టించగలరని తెలిపారు. ఈ కార్పొరేషన్ ద్వారా లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అనంతరం కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మాట్లాడుతూ చదివితే ప్రభుత్వమే ఉద్యోగాలిస్తుందనే భావనలో మార్పు వచ్చిందన్నారు. అందుకే ప్రభుత్వ, ఎంఎస్ఎంఈ ఆశయాలను విద్యార్థులకు అందించేందుకు తమ కళాశాల అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు ఎం.రంజిత్, కేఎస్‌వాసు సారథ్యంలో ఈ జాతీయస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతిథులు డాక్టర్ స్టీవెన్‌రాజు రచించిన గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా పుస్తకాన్ని, సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్ హిమాచలం దాసరాజు, ప్రొఫెసర్ ప్రసాదరావు, బి.శ్రీనివాస్, సదస్సు కన్వీనర్ డాక్టర్ స్టీవెన్‌రాజు, గవర్నింగ్ బాడీ సభ్యులు జీవీ కృష్ణంరాజు, జీవీకే వర్మ, శివరామకృష్ణ, విభాగాధిపతులు శ్రీనివాస్, నాగేశ్వరరావు, ప్రభాకర్ బాబ్జీ, ప్రసూన, శశిరేఖ, గోపాలకృష్ణ యాదవ్, మౌనిక, రమణ, అర్జునరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గేట్‌లో...గ్రేట్

- జేఎన్టీయూకేలోని యూసీఈకే విద్యార్థి ఘనత
- ఈసీఈ విద్యార్థి సీహెచ్ సాయిచరణ్‌కు జాతీయస్థాయిలో 9వ ర్యాంకు

జేఎన్టీయూకే, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గేట్-2025 పరీక్షలో జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈసీఈ విద్యార్థి సీహెచ్ సాయిచరణ్ ప్రతిభ కనబరచి 967 స్కోర్‌తో జాతీయస్థాయిలో 9వ ర్యాంకు సాధించినట్లు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈసందర్భంగా ఉత్తమ ర్యాంకు సాధించిన సాయిచరణ్‌ను శుక్రవారం తన ఛాంబర్‌లో ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో చదివినపుడు విజయాన్ని సులువుగా అందుకోగలరన్నారు. సాయిచరణ్‌ను అభినందించిన వారిలో రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, లీలాకుమారి ఉన్నారు.



సీహెచ్ సాయిచరణ్‌ను అభినందిస్తున్న వీసీ డాక్టర్ సీఎస్ఆర్కే ప్రసాద్

ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ ప్రయోజనాలపై అవగాహన సదస్సు



రిజిస్ట్రార్, డైరెక్టర్, అతిథులతో పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు

జేఎన్టీయూకే, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని సెనేట్ హాల్లో ఎన్ఏబీఎల్ గుణవత్త యాత్రలో భాగంగా నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ కాలిబ్రేషన్ లేబరేటరీస్ (ఎన్ఏబీఎల్) సహకారంతో జేఎన్టీయూకే స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్, ప్రయోజనాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. డైరెక్టర్, విభాగాధిపతి మాలోతు రమేష్ అధ్యక్షతన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, విశిష్టఅతిథిగా క్యూసీఐ డైరెక్టర్, ఎన్ఏబీఎల్ రీజినల్ హెడ్ శ్రీకాంత్ రామచంద్రయ్య, ఏడీ పి.శ్రీరామ్ పాల్గొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ వర్సిటీలోని ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ పొందడం ద్వారా పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం శ్రీ కాంత్ రామచంద్రయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ పొందిన పరిశ్రమలు, ప్రయోగశాలలు 9వేలకుపైగా ఉన్నాయని తెలిపారు. ఈ సదస్సులో పలు పరిశ్రమల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుర్గాడ శివాలయంలో

అరుణ కిరణ స్పర్శ

- స్వామిపై ప్రసరించిన సూర్యకిరణాలు

గొల్లప్రోలురూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మూలవిరాట్‌లపై అరుణ కిరణ స్పర్శతో భక్తులు తన్మయత్వంలో మునిగారు. శుక్రవారం సాయంత్రం ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. గర్భాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వర స్వామిపై సూర్యకిరణాలు ప్రసరించాయి. స్వామి, అమ్మవార్లు పసిడి రంగు వెలుగులతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తుల ఆధ్వర్యంలో స్మార్త విద్యార్థుల పండిత బృందంతో మహాసౌర పారాయణ చేశారు. భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్తరాయణంలో ఒకసారి, దక్షిణాయణంలో మరొకసారి ఏటా సూర్యకిరణాలు ప్రసరిస్తాయని ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు.



దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వరస్వామిపై ప్రసరించిన సూర్యకిరణాలు

27 నుంచి దక్షిణ భారత రాష్ట్రాల

వ్యవసాయ ప్రదర్శన

- రైతులను ఉచితంగా తీసుకువెళతాం
- జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త నరసింహారావు

దివాన్‌చెరువు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఈనెల 27 నుంచి 29 వరకూ దక్షిణ భారత వ్యవసాయ ప్రదర్శనను గుంటూరులోని లాంఫామ్‌లో నిర్వహిస్తున్నట్లు ఏరువాక కేంద్రం తూర్పుగోదావరిజిల్లా సమన్వయకర్త చల్లా వెంకట నరసింహారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల వ్యవసాయ పద్ధతులు, కూరగాయలు, పండ్ల సాగులో అధునాతన సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం తదితర అంశాల ప్రదర్శన ఉంటుందన్నారు. దీంతోపాటు రైతుల, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దక్షిణ భారత వ్యవసాయ నిపుణులు రైతులతో సంభాషిస్తారని చెప్పారు. ఈ ప్రదర్శనను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రదర్శనకు రైతులను ఉచితంగా తీసుకువెళతామని చెప్పారు. ఔత్సాహిక రైతులు ఏరువాక కేంద్రం వారిని 90323 46137లో సంప్రదించాలని నరసింహారావు పేర్కొన్నారు.

జనసేన తీర్థం పుచ్చుకున్న ఆరుగురు వైసీపీ ఎంపీటీసీలు

- తెనాలిలో మంత్రి నాదెండ్ల సమక్షంలో చేరిక

సర్పవరం జంక్షన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాకినాడరూరల్ మండలం వైసీపీ పార్టీకి ఆరుగురు ఎంపీటీసీలు షాక్ ఇచ్చారు. ఆపార్టీని వీడి జనసేన పార్టీ గూటికి చేరారు. శుక్రవారం తెనాలిలో జనసేనపార్టీ కార్యాలయంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో కాకినాడ రూరల్‌కు చెందిన ఆరుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులకు పార్టీ కండువాలువేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలకతీతంగా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి నాదెండ్ల కోరారు. జనసేనపార్టీ సిద్ధాంతాలు, అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నాయకత్వం, ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైసీపీని వీడి జనసేనలో చేరినట్లు ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. పార్టీ లో చేరిన ఇన్‌చార్జి ఎంపీపీ బందిలి విరీష ఎంపీటీసీలు వాసంశెట్టి సత్యవతి, కేతా సూర్యచంద్ర, గుత్తుల శ్రీనివాసరావు, గుత్తుల సత్తిబాబు, మామిడాల నాగచక్రంకుపార్టీ కండువాలువేసి మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే నానాజీ ఆహ్వానించారు.

జనసేన ఖాతాలో ఎంపీపీ

మండలంలో 18 ఎంపీటీసీ సభ్యులు ఉండగా, 15మంది వైసీపీనుంచి ఎంపీటీసీలుగా ఎన్నికకాగా, ముగ్గురు జనసేన నుంచి ఎన్నికయ్యారు. ఎంపీపీ పదవికి కొవ్వాడ ఎంటీపీసీ గోపిశెట్టి పద్మజ, సర్పవరం ఎంపీటీసీ పుల్ల వెంకటలక్ష్మిలు పోటీపడగా, అధిష్టానం గోపిశెట్టి పద్మజ పేరును ఖరారు చేసింది. చెరో రెండున్నర ఏళ్లు ఎంపీపీ పదవి పంచుకునేలా జంటిల్‌మెన్ ఒప్పందం చేసుకున్నారు. ఎనిమిది నెలల కిందట ఎంపీపీ పదవికి గోపిశెట్టి పద్మజ రాజీనామా చేయడంతో ఎంపీపీ పదవి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో జనసేనకు చెందిన ఎమ్మెల్యే పంతం నానాజీ ఎంపీపీ పదవి కోసం వ్యూహాత్మకంగా పావులు కదిపారు. వైసీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు జనసేనపార్టీలో చేరారు. దాంతో ఇప్పటివరకు వైసీపీకి ఉన్న 15 ఎంపీటీసీ సభ్యుల్లో 6 గురు జనసేనలో చేరగా 9మందికి పరిమితమైంది. దీంతో వీరి చేరికతో బలం 9కి చేరింది. పండూరుకు చెందిన ఎంపీటీసీ సభ్యులు నందిపాటి వెంకట శ్రీనివాస్ జనసేన పార్టీలో చేరుతున్నారన్న ఊహాగానాలు వినిపించడంతో 10మందితో జిల్లాలోనే జనసేన పార్టీకి చెందిన తొలిసారిగా ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకోనుందని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికకు హాజరు కాకుండా గైరుహాజరై పరోక్షంగా జనసేనకు మద్దతు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యేకు మరో ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

17 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెవెన్యూ విభాగంలో 17మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నోడల్ అధికారి, కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. పదోన్నతి పొందిన వారిలో జేవీవీఎస్ఎస్ విశ్వనాథ్, కె.అశోక్‌బాబ్జి, ఎస్.రాజారవి చంద్రశేఖర్, పి.సతీష్, సీహెచ్ శిరీష, కె.రవికుమార్, ఆర్.నాగూర్ మీరా, డి.శ్రీరవితేజ, జి.కృష్ణకాంత్, ఎం.రవికిరణ్, కె.సాయికుమార్, ఎం.నితిన్‌కుమార్, ఎం.జాకబ్, సీహెచ్‌టీవీవీ సత్యకాంత్, ఎన్.దుర్గవెంకటేష్, టి.లోహిత్ సాయి, కె.మురళీకృష్ణలు ఉన్నారు. ఉత్తర్వులు తీసుకున్న 15 రోజుల్లో కేటాయించిన పోస్టుల్లో చేరాలని ఆదేశించారు.

మే లో అమెరికాకు జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మేలో ఆమెరికా వెళ్లనున్నారు. దీనికి సంబంధించి 10 నుంచి 17వ తేదీవరకూ మే నెలలో సెలవుకోరగా ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వీసీ తన వ్యక్తిగత పనులకోసం అమెరికా వెళ్లనున్నారు. ఆ పీరియడ్‌లో విశాఖపట్నం ఆంధ్రావిశ్వవిద్యాలయం వీసీ జీపీ రాజశేఖర్ జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరిస్తారని సమాచారం.

మతసామరస్యానికి ప్రతీక

నిర్మలగిరి పుణ్యక్షేత్రం



నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మేరీమాత ఆలయం

నేటి నుంచి 25 వరకు ఘనంగా ఉత్సవాలు
క్రైస్తవులతో పాటు తరలిరానున్న హిందువులు

దేవరపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిర్మలగిరి మేరీమేత పుణ్యక్షేత్రం ఎంతో పేరుగాంచింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని ఈ మేరీ మేత పుణ్యక్షేత్రం ఉత్సవాలకు ఏటా భారీసంఖ్యలో భక్తులు వస్తుంటారు. గత 40ఏళ్లుగా నిర్మలగిరి ఉత్సవాలు ప్రతీ ఏడాది మార్చి 22 నుంచి 25వరకు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో పుణ్యక్షేత్రంలో శనివారం జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, పుణ్యక్షేత్ర డైరక్టర్ జాన్‌పీటర్ చేశారు.

ఇదీ ఆలయ చరిత్ర...

ఏలూరు పీఠాధిపతి జాన్‌ములగాడ ఏలూరు నుంచి విశాఖపట్నం వెళ్తూ మార్గమధ్యలో గౌరీపట్నం సమీపంలో


గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రధాన ఆలయం

కారుకు అంతరాయం ఏర్పడటంతో ఆ ప్రాంతంలో పీఠాధిపతికి మేరీమాత సాక్షాత్కరించి తనకు ఆలయం నిర్మించాలని ములగాడకు ఆలోచింపచేశారు. దీంతో గౌరీపట్నం హైవే పక్కన గల కొండ వద్ద ఆలయ నిర్మాణానికి సమయాత్తం మయ్యారు. గౌరీపట్నం ప్రముఖులు గ్రామపెద్దలతో సంప్రదించి భూసేకరణ చేసి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి కొండపైన ఆలయాన్ని, రోడ్డు పక్కన గేటు సమీపంలో మేరీమాత మందిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ పుణ్యక్షేత్రాన్ని క్రైస్తవులతో పాటు హిందువులు కూడా దర్శించుకోవడం విశేషం. క్షేత్ర డైరెక్టర్‌గా ఫాదర్ ఆరోన్ దిరిసన బాధ్యతలు చేపట్టి ప్రధాన ఆలయాన్ని నిర్మించారు. 2000 సంవత్సరంలో నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో అన్ని హంగులతో ప్రధాన దేవాలయం నిర్మాణం జరిగింది. ఈ క్రమంలో ఏలూరు పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టిన పొలిమేర జయరావు ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్‌గా ఫాదర్ రాయప్ప బాధ్యతలు చేపట్టారు. క్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా రోడ్లు, కళావేదిక, భక్తులు వెళ్లే మార్గంలో చెట్లు నాటించారు. ఈ ఆలయంలో ముఖ్యంగా తలనీలాలు సమర్పించడం, కొబ్బరి కాయలు కొట్టడం, లడ్డూలు భక్తులు అందజేయడం, కొవ్వొత్తులు వెలిగించడం చేస్తుంటారు. ఇక్కడ నిత్యాన్నదానం అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. అన్నదాన కాంట్రాక్టర్ కల్లే నాగేశ్వరరావు భక్తులు సౌకర్యార్థం కూలింగ్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో నిర్మల హృదయ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశారు. ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పుణ్యక్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, 200మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు పలు రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు హాజరవుతారని చెప్పారు.

సత్యదేవుని ఆలయ పునఃనిర్మాణ ప్రారంభం దినోత్సవం


పండితులను సత్కరిస్తున్న ఆలయ ఈవో సుబ్బారావు

అన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని ఆలయం పునఃనిర్మించి 13 ఏళ్లు పూర్తిచేసుకుని 14వ ఏటా అడుగిడిన సందర్భాని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మూల వరులకు అభిషేకం అనంతరం స్వామివారికి లక్ష పత్రిపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 2012 ఆలయ శిఖర ప్రతిష్ఠలో పాలుపంచుకున్న ఆరుగురు పండితులకు ఈవో వీర్ల సుబ్బారావు దుశ్శాలువా కప్పి పుష్పమాలాంకృతలను చేసి నగదు పురస్కారంతో సత్కరించారు. సత్కారం అందుకున్నవారిలో ఆకొండి వ్యాసమూర్తి, గొర్తి సుబ్రహ్మణ్య ఘనాపాఠి, గాడేపల్లి సత్యనారాయణ తదితరులున్నారు.

- పండితులు, అర్చకులకు ఘన సత్కారం

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి పూజలు

సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివజ్ఞానం కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ రామ్మోహనరావు, పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా అధికారులు స్వామివారి చిత్రపటం, మెమెంటో అందజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్ తదితరులున్నారు.


సత్యదేవుని దర్శనానంతరం న్యాయమూర్తి

ఎట్టకేలకు ప్రసాద్ స్కీం పనులకు టెండర్లు ఖరారు

అన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం పనులకు సంబంధించి టెండర్లు ఖరారైనట్టు టూరిజంశాఖ అధికారులు తెలిపారు. సుమారు రూ.25.32 కోట్ల అంచనాలతో రూపొందించిన ఈ పనులకు సుమారు ఏడాది క్రితం ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కాశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం వీటికి టెండర్లు పిలవగా సాంకేతిక కారణాలతో వీటిని నిలుపుదల చేసి రీటెండర్లను పిలిచారు. రూ.25.32 కోట్లతో పిలిచిన టెండర్లను విశాఖపట్నంకు చెందిన ఒక సంస్థ టెండర్ 16శాతం తక్కువకు కోడ్ చేసి టెండర్ దక్కించుకుంది. త్వరలో అగ్రిమెంట్ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో ప్రధానంగా నూతన అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, మరుగుదొడ్లు, 2 ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్‌స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. ఈ పనులకు దేవస్థానానికి ఏ సంబంధం ఉండదు. టూరిజంశాఖ ఆధ్వర్యంలోనే చేపట్టనున్నారు.

రెండు బోర్లకు భూమిపూజ

ఏలేరు నీటిని రిజర్వాయర్‌లోకి మళ్లింపు అంశంపై అసంపూర్తిగా సమావేశం

వేసవిలో భక్తులకు నీటి సమస్యలు ఏర్పడకుండా త్వరితగతిన రూ.10లక్షలతో 2 బోర్లు ఏర్పాటు కు శుక్రవారం ఈవో వీర్ల సుబ్బారావు భూమిపూజ నిర్వహించారు. ఈ 2 బోర్ల ద్వారా నీటిని సత్యగిరి కొండపై వాటర్‌ట్యాంక్‌కు చేర్చి హరిహరసదన్, శివసదన్, విష్ణుసదన్, అతిథి గృహాలు, ఉచిత కల్యాణమండపాలకు అందజేయడం జరుగుతుందని ఈవో తెలిపారు. మరో పక్క పంపాజలాశయంలోకి ఏలేరు నీటిని రిజర్వాయర్‌లోకి మళ్లించే విషయమై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో ఇరిగేషన్, పోల వరం అధికారులు నిర్వహించిన సమావేశం అసంపూర్తిగా ముగిసింది. పోలవరం పనులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించి అందజేస్తామని, దీని నిధులు ఇప్పించాలని పోలవరం అధికారులు కోరారు. సుమారు రూ.40 లక్షలు వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- కొత్తపల్లి మండలం కొమరగిరి ఇళ్ల స్థలాల లేఅవుట్ వద్ద నిరసన
- ర్యాలీకి అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు


కొమరగిరిలో పేదలకు స్థలాలు మంజూరు చేయాలని ఆందోళన చేపట్టిన సీపీఎం నాయకులు

కొత్తపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే నిరుపేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి మెగా ఇళ్ల స్థలాల కాలనీ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. తొలుత ఆనందనగరం నుంచి కొమరగిరి జగనన్న మెగా ఇళ్లకాలనీ వద్దకు వెళ్లడానికి అనుమతి లేదని కొత్తపల్లి పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆందోళనకారులతో కలిసి సీపీఐ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ సమస్యలపై స్థానిక తహశీల్దార్‌ను కలిసి చర్చించేందుకు వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లస్థలాల మంజూరు కోసం కొనుగోలు చేసిన భూమిని వైసీపీ నాయకులు అధికారులతో కుమ్మక్కై పలువురు రైతులకు కౌలుకు ఇచ్చి సాగు చేయడంపై రామకృష్ణ మండిపడ్డారు. నిరుపేదల ఇళ్లస్థలాల కోసం రైతులకు పరిహారం చెల్లించి కొనుగోలు చేసిన భూమిని కచ్చితంగా ప్రభుత్వానికే చెందుతుందన్నారు. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టి పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమిని కౌలుకు ఇచ్చేందుకు సహకరించిన అధికారులపై చర్యలు చేపట్టాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు సాకా రామకృష్ణ, తాటిపాక మధు, లోడ అప్పలరాజు, తోకల ప్రసాద్, కేశవరపు అప్పలరాజు, ఎ.భవాని, బల్ల సురేష్, కేతా గోవిందు, వి.గురవయ్య, ఝాన్సీ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


సుబ్బయ్యమ్మ (ఫైల్)

దేవీపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవారం గ్రామ పంచాయతీ పరిధి పోతవరం గ్రామం ఆదివాసీ కుల శతాధిక వృద్ధురాలు కుంజం సుబ్బయ్యమ్మ(110) శుక్రవారం మృతిచెందారు. మూడు తరాలు చూసిన సుబ్బయ్యమ్మ అంగన్‌వాడీ ఆయాగా ఎంతో మందికి వంట చేసి వడ్డించారు.

ఆరేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదు

కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల కాంట్రాక్టర్ల ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల కాంట్రాక్టర్లు, మున్సిపల్ కాంట్రాక్టర్లు కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎస్ శాంతారామ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొత్త పనులకు టెండర్లు వేయలేకపోతున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించడానికి పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించడానికి వీలుగా సీఎఫ్ఎంఎస్ నిధి పోర్టల్‌లో సాంకేతిక అడ్డంకులను పరిష్కరించాలన్నారు. ఆర్ అండ్‌బీ విభాగంలో రూ.1350కోట్ల నాబార్డుతో సహా వివిధ ప్రణాళికల కింద నిధుల క్లియరెన్స్ చేయాలన్నారు. అదనంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల అప్‌లోడ్ చేయని బిల్లుల మొత్తం రూ.500కోట్లు ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.800కోట్లు ఉన్నాయన్నారు. ఇతర విభాగాల్లో రూ.5వేలకోట్ల బిల్లులు క్లియరెన్స్ చేయాల్సిఉందని శాంతారామ్ తెలిపారు. తొలుత ర్యాలీ కాకినాడ శారదాదేవి గుడి వద్ద ఉన్న మున్సిపల్ కార్యాలయం నుంచి బయలుదేరి కాకినాడ కలెక్టరేట్‌కు చేరింది. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాలకృష్ణ, ప్రకాష్‌రావు, ప్రసాద్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద

సీఆర్పీఎఫ్ విస్తృత తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం శుక్రవారం జరిగిన ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ డివిజన్లో రెండు భారీ ఎదురుకాల్పులు ఘటనలో 30మంది మావోయిస్టులు మృతి చెందారు. ఒకజవాను వీరమరణం పొందారు. ఈ నేపథ్యంలో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. మోతుగూడెం నుంచి సుకుమామిడి నుంచి నేలకోట వెళ్లే మార్గంలో సీఆర్పీఎఫ్ బెటాలియన్ బలగాలు దారి పొడవునా తనిఖీలు నిర్వహించారు. ట్రైనింగ్ ఎస్ఐ సీతారాం ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. మోతుగూడెం సుకుమామిడి మార్గాల వైపు నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నేలకోట సరిహద్దు ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్ బలగాలు నిఘా పెట్టాయి. తనిఖీల్లో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ధరం ప్రకాష్, సీఆర్పీఎఫ్ ఏ/41 బెటాలియన్ సిబ్బంది, సివిల్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.


సరిహద్దు ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్ బలగాల తనిఖీ

బాలికపై అత్యాచారం..

50 ఏళ్ల వ్యక్తికి ఐదేళ్ల జైలు

అయినవిల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయిన విల్లి మండలంలో ఓ మూడేళ్ల బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు జడ్జి కె.శ్రీదేవి తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. వివరాల ప్రకారం.. 2023 మే 11న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన డెక్క రాంబాబు (50) బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లి గడియ పెట్టాడు. చుట్టుపక్కలవారు చూసి రాంబాబు ఇంటి తలుపులు పగులకొట్టి బాలికను పిలిచారు. బాలికను బయటికి పంపించి అక్కడి నుంచి రాంబాబు పరారయ్యాడు. జరిగిన ఘటనను బాలిక తన తల్లికి ఏడుస్తూ చెప్పగా అదేరోజు అప్పటి ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు అయినవిల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ దర్యాప్తు చేసి రాంబాబును అరెస్టుచేసి పూర్తి సాక్ష్యాధారాలతో కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించారు. కాకినాడ పోక్సో కోర్టులో కేసు ట్రయల్ నిర్వహించారు. పీటీ జి.వెంకటరత్నంబాబు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదోపవాదాలు అనంతరం రాంబాబుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీదేవి నింది తుడికి ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠినచర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ కృష్ణారావు హెచ్చరించారు. సీఐ రుద్రరాజు భీమరాజు, సిబ్బందిని అభినందించారు.

గ్యాస్ సిలిండర్ లీకై పెంకుటిల్లు దగ్ధం

దంపతులకు గాయాలు


వడిశలేరులో కాలిపోయిన పెంకుటిల్లు

రంగంపేట,మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ వద్ద మంటలు చెలరేగడంతో పెంకుటిల్లు దగ్ధమైంది. భార్యాభర్తకు గాయాలయ్యాయి. వీఆర్వో టి.అశ్విని వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరులోని బీసీ కాలనీలో గోనబోయిన సత్యనారాయణ, గోనబోయిన శ్రీనుల కుటుంబాలు ఓ పెంకుటింట్లో నివాసముంటున్నాయి. శుక్రవారం ఉదయం 11.30 సమయంలో సత్యనారాయణ భార్య గంగారత్నం వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. ఇంటికి నిప్పంటుకుని 2కుటుంబాలకు చెందిన గృహోపకరణ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సత్యనారాయణ, గంగారత్నం ముఖం, కాళ్లు కాలిపోయాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. ఘటనలో సుమారు 1,50,000 ఆస్తి నష్టం జరిగినట్టు వీఆర్వో పేర్కొన్నారు. కాగా తక్షణ సాయంగా తహశీల్దార్ కోసు అనసూయ 2 కుటుంబాలకు బియ్యం, పంచదార సమకూర్చి అందజేశారు.

మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. ఈ నెల 19న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని ఏసిఆర్ లాడ్జి సమీపంలోని పాలింపాటి నరసయ్యనగర్‌లో 23వ వార్డు చిట్టూరివారి వీధికి చెందిన కుందుల పద్మకుమారి సాయంత్రం సమయంలో వాకింగ్ చేస్తుంది. సీతంపేట మండలం కాటవరానికి చెందిన బొద్దు సూర్యనారాయణ అలియాస్ సూరి అనే వ్యక్తి వెనుక నుంచి వచ్చి పద్మకుమారి మెడలోని ఆరున్నర కాసుల రెండుపేటల బంగారపు గొలుసును లాక్కుని బైక్‌పై వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో సూర్యనారాయణను శుక్రవారం దొమ్మేరు అండర్ పాస్ వద్ద అరెస్టు చేసి అతడి వద్ద నుంచి బంగారపు గొలుసును పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చామన్నారు. త్వరగా దొంగతనం కేసును చేధించి నిందితుడిని అరెస్టు చేయడంతో సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావును జిల్లా ఎస్పీ అభినందించినట్టు డీఎస్పీ చెప్పారు.

ఒక్క చేప రూ.10వేలు

కాకినాడ కుంభాభిషేకం బీచ్ వద్ద శుక్రవారం ఒక మత్స్యకారుడి వలకు 60 కిలోల బరువు గల కొమ్ముకోనం చేప పడింది. ఇది సుమారు రూ.10 వేల వరకు ధర పలుకుతుందని, కేరళకు ఎగుమతి చేస్తామని అతడు చెప్పడం విశేషం.
– ఫొటోగ్రాఫర్, కాకినాడ



తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి...

మోటారు సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి


సతీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రాయవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం రాయవరంలో ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడిద గ్రామానికి చెందిన చొక్కా సతీష్ (35) కాకినాడలో ఒక చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఏడిదలో తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి శుక్రవారం ఉదయం సతీష్ తిరిగి మోటారుసైకిల్‌పై కాకినాడ వెళ్తుండగా మాచవరం -పసలపూడి ప్రధాన రహదారిలో ఇటుకల బట్టీ వద్దకు వచ్చేసరికి సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని సతీష్ ఢీ కొనడంతో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో సతీష్ తలకు గాయమై సంఘటనా స్థలంలో మృతిచెందినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ పి.దొరబాబు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చెట్టుపై నుంచి జారి పడి ఆదివాసీ బాలిక మృతి

ఎటపాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివాసీ బాలిక మృతి చెందిన ఘటన శుక్రవారం ఎటపాక మండలం చింతలపాడు వలస ఆదివాసీ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మడివి జ్యోతిలక్ష్మీ(12) ఐదురోజుల క్రితం అటవీ ప్రాంతంలోకి తునికి కాయలు (పండ్లు) సేకరణకు వెళ్లింది. చెట్టు ఎక్కి అక్కడ నుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముందుగా లక్ష్మీపురం పీహెచ్‌సీకి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ తరలించారు. అయితే చికిత్స పొందుతూ బాలిక శుక్రవారం మృతి చెందింది.

పాటు కాటుకు ఉపాధి కూలీ మృతి

కిర్లంపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం పంటకాలువ పూడిక తీత పనిచేస్తున్న ఉపాధి కూలీ నీలాద్రి అప్పారావు(53) పాముకాటుకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడని స్థానికులు తెలిపారు.

ఏలూరు రేంజ్‌లో 31 మంది ఏఎస్ఐలకు పదోన్నతి

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్‌లో ఏఎస్ఐలుగా పనిచేస్తున్న 31 మందికి ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు ఏఆర్ఎస్ఐలకు ఆర్ఎస్ఐలుగా పదోన్నతి కల్పించారు. అల్లూరు సీతారామరాజు జిల్లాలో ఆరుగురు, కాకినాడ జిల్లాలో నలుగురు, కోనసీమ జిల్లాలో 8మందికి, తూర్పుగోదావరి జిల్లా 8మంది, ఏలూరు జిల్లా ముగ్గురికి ఎఎస్ఐల నుంచి ఎస్ఐలుగా, ఎన్టీఆర్ జిల్లాలో ఎఆర్ఐ ఎస్ఐలకుఆర్ఎస్ఐలుగా పదోన్నతికల్పించారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని ప్రశ్నించినవారిపై దాడి

ఇద్దరికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని ప్రశ్నించిన వారిపై దాడికి దిగడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో తాటిపర్తి పుంతరోడ్డు జంక్షన్‌కు సమీపంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. బైపాస్‌రోడ్డులో ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వస్తూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదని ఆ మార్గంలో వెళ్తున్న తాటిపర్తికి చెందిన మురాలశెట్టి సూర్యతేజ, పేకేటి ప్రసాద్ వారిని ప్రశ్నించారు. ఇదే సమయంలో ఆ వ్యక్తులకు సంబంధించిన మరికొందరు వచ్చి సూర్యతేజ, ప్రసాద్‌పై దాడికి దిగారు. వారికి తీవ్రగాయాలవ్వగా చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సఖినేటిపల్లి-నర్సాపురం రేవు పాట రూ.4,18,18,959కు టెండరు ఖరారు

అంతర్వేది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి-నర్సాపురం మాధవాయపాలెం ఫెర్రీ సంవత్సరానికి టోల్ వసూలు హక్కులు పొందేందుకు శుక్రవారం బహిరంగ టెండరు వేలం నర్సాపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. హెచ్చుపాటదారుడైన శ్రీవిఘ్నేశ్వర కోఆపరేటివ్ బోట్స్ సొసైటీ టేకిశెట్టివారిపాలెం పేరున రూ.4,18,18,959కు వేలం ఖరారైందని సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లికార్జునరావు, ఎంపీడీవో ఇన్‌చార్జి ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, జడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, నర్సాపురం మండల పరిషత్ అధికారులు ఉన్నారు.

బ్యాంక్‌లు చొరవ చూపాలి



- ఎస్సీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ యూనిట్స్ ఏర్పాటుకు కృషి చేయాలి
- కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ యూనిట్స్ ఏర్పాటులో బ్యాంక్‌లు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం బ్యాంకర్లతో 2024-25 సంవత్సరం నాలుగో త్రైమాసిక జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ వెనుకబడిన తరగతులు, ఇతర వెనుకబడిన తరగతుల కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్ ఈ ఏడాదికి ఇచ్చిన యూనిట్స్ గ్రౌండింగ్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 22 నాటికి పూర్తి చేసి ఏప్రిల్ 7 న స్క్రూట్నీ రుణ మంజూరు పూర్తి చేసి 11న జ్యోతిరావు పూలే జయంతి నాటికి గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ ఏబీసీడీ గ్రూపులకు 1229 యూనిట్స్, జనరిక్ మెడికల్ షాప్స్ 24 యూనిట్లు, బాంబూ బాస్కెట్, పోటరీ 121 యూనిట్స్, కాపు కార్పొరేషన్ ద్వారా 749 యూనిట్స్, కాపు కార్పొరేషన్ ద్వారా ఎంఎస్ఎంఈకి చెందిన ఎనిమిది యూనిట్లు, ఈడబ్ల్యూసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు 173 యూనిట్స్, జనరిక్ మెడిసిన్ 30 యూనిట్లు, షెడ్యూల్డ్ కాస్ట్ సహకార సొసైటీ ద్వారా 699 యూనిట్స్, మైనార్టీ కార్పొరేషన్ 12 యూనిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంకులు చొరవ తీసుకుని సరళీకృత విధానంలో యూనిట్స్ ఏర్పాటుకు సహకరించాలన్నారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్ డీజీఎం ఎ.విశ్వేశ్వరరావు, నాబార్డు ఏజీఎం వైఎస్ నాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, ఎల్‌డీఎం డీవీ ప్రసాద్, ఇతర జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్ట్ ఎడమ కాలువ పరిశీలన

సీతానగరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపురుపల్లి పరిధిలోని అచ్చియ్యపాలెం దగ్గరలో పోలవరం ప్రాజెక్ట్ ఎడమ కాలువను శుక్రవారం సీతానగరం తహశీల్దార్ ఎ శ్రీనివాస్ పరిశీలించారు. పోలవరం ఎడమ కాలువ తవ్వకాలకు కొండరాళ్లు అడ్డు రావడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడవ కాలువ తవ్వకాలకు కొండరాళ్లు అడ్డు వస్తున్నాయని, వాటిని బ్లాస్ట్ చేయడానికి అనుమతుల కోసం పరిశీలిస్తున్నామన్నారు. అచ్చియ్యపాలేనికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉందని, బ్లాస్ట్ చేయడానికి ఎటువంటి అభ్యంతరాలు లేవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీంద్ర, సర్వేయర్ గౌతమ్ వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

దేశంలో 17.7 శాతం తగ్గిన టీబీ కేసులు

పార్లమెంట్‌లో ఎంపీ పురందేశ్వరి ప్రశ్నకు కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి వివరణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో టీబీ కేసులు 17.7 శాతం మేర తగ్గాయని, మరణాల సంఖ్య 21.4 శాతం తగ్గిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా వెల్లడించారు. 2015 నుంచి ఈ తగ్గుదల నమోదైందని తెలిపారు. శుక్రవారం పార్లమెంట్‌లో రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమం పురోగతిపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్యమంత్రి సమాధానమిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ టీబీ నివేదిక-2024 ప్రకారం ఈ తగ్గుదల నమోదైనట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక లక్ష్యాలతో టీబీ నిర్ధారణ పరీక్షలు పెంచడం, మాలిక్యులర్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ల విస్తరణ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా టీబీ చికిత్స సేవలను గ్రామస్థాయికి విస్తరించడం వంటి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

రాజమహేంద్రవరంలో పీ4, వార్డు సభలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో పీ4, వార్డు సభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక లాలాచెరువు ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ఉదయం 1,2,50,51 వార్డుల్లో మధ్యాహ్నం, జాంపేట ఫిష్ మార్కెట్ వద్ద 24, 30,32,33 వార్డులకు, అలాగే 26,27,28,29 వార్డులకు మునిసిపల్ స్టేడియంలోను సాయంత్రం జరిగిన పీ4 సర్వే, వార్డు సభలకు మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ హాజరయ్యారు. ప్రభుత్వ ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం(పీ4)తో అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాలకు దాతలు సహకరించాలన్నారు. పీ4 అమలులో భాగంగా మార్చి 8నుంచి 20వరకు ఇంటింటికీ సర్వే నిర్వహించి 20శాతం నిరుపేదల సమాచారాన్ని వార్డుల వారీగా సేకరించి ఈ నెల 21న కార్పొరేషన్ పరిధిలో 13 వార్డులకు సంబంధించి శుక్రవారం వార్డు సభలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ కోటయ్య, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజావల్లి, ఆయా డివిజన్‌కు సంబంధించిన మాజీ కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా



అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాజమహేంద్రవరం అంబేడ్కర్ సెంటర్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి శుక్రవారం ఉదయం నిరసన ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఇసుకపట్ల రాంబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి సహజ సూత్రాలకు విరుద్ధమని, నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. మర్రి బాబ్జి మాట్లాడుతూ ఏక సభ్య కమిషన్ గ్రామాల్లో సరిగ్గా అధ్యాయనం చేయకుండా నివేదిక ఇవ్వడం, దానిపై ప్రభుత్వం వర్గీకరణకు ఆమోద ముద్ర వేయడం సమంజసం కాదన్నారు. పట్నాల విజయకుమార్ మాట్లాడుతూ వర్గీకరణ కుట్రపూరితంగా చేశారన్నారు. అనంతరం ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేసి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. జార్జి ఆంటోని, నక్కా వెంకటరత్నం, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబురాజేంద్రప్రసాద్, ఎల్‌వీ ప్రసాద్, జంగా బాబురావు, కొంకి రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పనిభారం తగ్గించండి

జిల్లా పంచాయతీ అధికారికి వినతి

కడియం/ రాజమహేంద్రవరంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రోజురోజుకు పనిభారం పెరుగుతోందని, దీనితో మానసిక ఒత్తిడి, తద్వారా అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం డీపీవో శాంతామణికి వినతిపత్రం అందజేశారు. ఎన్నడూ లేని విధంగా సర్వేలతో పాటు అనేక పనులు అప్పగించడంతో వాటి నిర్వహణ కష్టసాధ్యం అవుతుందన్నారు. ఇప్పటికే మానసిక ఒత్తిడితో అనేక మంది అనారోగ్యంతో మరణించారన్నారు. ప్రభుత్వం సుమారు 15 రకాల సర్వేయాప్‌లు ద్వారా చేయడం చాలా భారంగా మారిందన్నారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, హౌస్‌హోల్డ్ జియో టాగింగ్ సర్వే, వర్క్‌ఫర్ హోం సర్వే, పీఎసీఎస్ సర్వే చైల్డ్ ఆధార్‌సర్వే, విలేజ్‌ప్రొఫైల్ సర్వే వంటివి ఆన్‌లైన్‌లో సర్వే చేయడం కష్టసాధ్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు టంకాల శ్రీనివాస్, మేకా ప్రసాద్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి.వెంకట్రావు, కార్యదర్శులు రూప్‌చంద్, వి.శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, కొవ్వూరు డివిజన్ కార్యదర్శులు షేక్ కసీమ్‌సాహెబ్, మొహ్మద్‌జానీ పాల్గొన్నారు.

ఆర్టిస్ట్.. రొమాంటిక్ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి నగరానికి చెందిన డాక్టర్ జేమ్స్‌వాట్ కొమ్ము నిర్మాతగా, రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్ కథాంశాలతో కొత్త హీరోహీరోయిన్లతో, రతన్ రిషి దర్శకత్వం వహించిన ఆర్టిస్ట్ చిత్రం శుక్రవారం స్థానిక సాయికృష్ణ థియేటర్(అనుశ్రీ)లో ఉదయం ఆటతో విడుదలైంది. సంతోష్, క్రిహికా పటేల్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ సందర్భంగా నిర్మాత డాక్టర్ జేమ్స్‌వాట్ కొమ్ము, ఆఫీసు మేనేజర్ బళ్ల హెలీ బాలజ్యోతి మీడియాతో మాట్లాడుతూ, నూతన నటీనటులతో తీసిన ఆర్టిస్ట్ సినిమా, గొప్ప హార్రర్ చిత్రమని, యువతను బాగా ఆకట్టుకుంటుందని, కొత్త నటులు బాగా నటించారని పేర్కొన్నారు. ఆర్టిస్ట్ సినిమా బాగుందని కేతా శ్రీనివాస్ మెచ్చుకున్నారు. కార్యక్రమంలో కాటల రజనీకాంత్, బూడిద శరత్‌కుమార్, డేవిడ్ పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ కేటగిరీలో చేర్చండి

దీనిపై అసెంబ్లీలో ప్రస్తావించండి.. వాల్మీకి బోయల సంఘం కోఆర్డినేటర్ రమాదేవి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్‌టీ కేటగిరీలో చేర్చేందుకు ఎమ్మెల్యేలు, మంత్రులు చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ పల్లం రమాదేవి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కూటమి ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. వృత్తిలేని వాల్మీకి, బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, మంత్రులు స్పందించి అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి న్యాయం చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

పర్యావరణానికి హాని చేయొద్దు

- 'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధిపై జాతీయ సెమినార్



సెమినార్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో పర్యావరణానికి హాని చేకూర్చకూడదని, పర్యావరణ హితంగా జీవించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలోని కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధిపై శుక్రవారం జరిగిన రెండు రోజుల జాతీయ సెమినార్‌ను వీసీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవిని అక్షరాన్ని కలిపి నాటానని, అడవిలో అక్షర సేద్యం చేస్తూ వచ్చానని, వాటి వృద్ధిని చూసానని ఇటువంటి స్థిరమైన వృద్ధే సుస్థిర అభివృద్ధి అన్నారు. విశ్రాంత ఆచార్యులు పి.సుబ్బారావు మాట్లాడుతూ ఏకోప్రెన్యూర్ షిప్, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ మధ్య వ్యత్యాసాలను వివరించారు. సమావేశంలో వర్ధమాన పారిశ్రామిక వేత్త సౌజన్య, ఎ.బిందు, కె.లావణ్య, వి.నిరీష, సెమినార్ కన్వీనర్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి, ఆచార్య ఎన్. ఉదయ భాస్కర్ పాల్గొన్నారు. సెమినార్‌కు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సెమినార్ హాల్ ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను వీసీ సందర్శించి నిర్వాహకులను అభినందించారు.

ప్రపంచ కవితా దినోత్సవం

నన్నయ వర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల తెలుగు, ఆంగ్లశాఖల ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించారు. వీసీ ప్రసన్నశ్రీ విచ్చేసి మాట్లాడుతూ కవిత్వం మనకు మనస్సుకు, మనకు ప్రపంచానికి, మనకు దేవునికి మధ్య ఛానల్ వంటిదని అభివర్ణించారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో కవిత్వంలోని మాధుర్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి చిన్నబాబు, విద్యార్థులు వి.దయానా, జి.రాణి తమకవిత్వాలను వినిపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఆంగ్ల, తెలుగు శాఖాధిపతులు ఎన్.సజనారాజ్, డి.లక్ష్మీనరసమ్మ, అధ్యాపకులు కె.ఎస్.రమేష్, తలారి వాసు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవానికి నన్నయ యూనివర్శిటీ ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కవి హృదయం చక్కని భావావేశంతో స్పందించినపుడు అక్షరాలు ఆయుధంగా మారి కవిత్వం పుట్టుకొస్తుందన్నారు. చక్కని పదబంధాలతో భావాలను అల్లడమే కవి గొప్పతనం అని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు, అధ్యాపకులు ఎస్.రాజకుమార్, పల్లి సుధా, జే.సుగుణ, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్-2025పై వర్క్‌షాపులో డీపీఎం తాతారావు



వర్క్ షాపులో మాట్లాడుతున్న డీపీఎం తాతారావు

బిక్కవోలు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి అధిక సంఖ్యలో రైతులు సాగు చేసేలా చూడాలని డీపీఎం తాతారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్-20 25కు సంబంధించి బిక్కవోలు, రంగంపేట మండలాలకు సంబంధించి కమ్యూనిటీ మేనేజెడ్ నాచురల్ ఫార్మింగ్, వ్యవసాయశాఖ, డీఆర్‌డీఏ సెర్ప్ సమన్వయంతో అధికారులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా తాతారావు కేపీపీ ముఖ్య ఉద్దేశ్యం వివరించారు. ఇందులో సెర్ప్, ఏపీఎం, సీసీ, వీవోఏ, వీవోవోబీల పాత్రను ఏడీపీఎం వలీ తెలిపారు. అనంతరం తాతారావు మాట్లాడుతూ పంటలకు ప్రకృతి సాగులో కషాయాలను వినియోగిస్తే ఆరోగ్యకరమైన పంటలు వస్తాయని,వాటిని తినడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా వుంటామని, నేల సాంద్రత కూడా పెరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలో చిన్న, సన్నకారు రైతులంతా ఈ వ్యవసాయం చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కిచెన్ గార్డెన్‌కు ఇంట్లోనే సేంద్రీయ ఎరువులు తయారు చేసి వాడుకోవచ్చునన్నారు. అనంతరం ఆదర్శ రైతులు, మహిళా రైతులను సన్మానించారు. కార్యక్రమంలో పీఎం అజయ్, ఏడీఏ కృష్ణ, ఏవోలు జాన్, శ్రీనివాస్, ఏపీఎం సుప్రియ, ఎన్ఎఫ్ఏ కృపావతి పాల్గొన్నారు.

పది పరీక్షలు ప్రశాంతం: ఆర్‌జేడీ

- రాజానగరం, రంగంపేటలో పర్యటించిన విద్యాశాఖాధికారి
- రంగంపేట హైస్కూల్లో అపరిశుభ్రంగా బాలికల బాత్‌రూమ్‌లు
- చీఫ్ సూపరింటెండెంట్‌పై ఆగ్రహం

రాజానగరం/రంగంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం నరేంద్రపురం, రంగంపేట మండలంలో వడిశలేరు, రంగంపేట హైస్కూళ్లలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఆర్‌జేడీ నాగమణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయం తదితర ఏర్పాట్లను ఆర్‌జేడీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. రంగంపేట హైస్కూల్లో బాలికల బాత్‌రూమ్‌లను పరిశీలించి అవి శుభ్రంగా లేకపోవడంతో పరీక్షల చీఫ్ సూపరింటిండెంట్ జయరామ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎటువంటి మాస్‌కాపింగ్‌కు పాల్పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. కాగా రాజానగరం మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 1184 మంది విద్యార్థులకు గానూ ఇంగ్లీష్ పరీక్షకు ఏడుగురు హాజరుకాలేదని మండల విద్యాశాఖాధికారులు ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు. మండలంలో సంపత్‌నగరం హైస్కూల్ పరీక్ష కేంద్రంలో నలుగురు విద్యార్థులు, రాజానగరంలో ఒకరు, దివాన్‌చెరువు సూర్యగ్లోబల్ స్కూల్లో ఒకరు, దివాన్‌చెరువు హైస్కూల్ పరీక్షా కేంద్రంలో ఒకరు పరీక్షకు గైర్హాజరైనట్లు చెప్పారు. మండలంలో ఏడు పరీక్షా కేంద్రాల్లోనూ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. హాజరుకాలేదన్నారు. కాగా రంగంపేట మండలం వడిశలేరు, రంగంపేట, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాల్లోని పదోతరగతి ఇంగ్లీషు పరీక్షకు 572 మంది విద్యార్థులకు గాను 571 మంది హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి పి.మధుసూధనరావు తెలిపారు. రంగంపేటలో 205 మందికి 205 మంది, వడిశలేరులో 183 మందికి 183 మంది, సింగంపల్లి హైస్కూల్లో 184 మందికి 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ వెంట గోకవరం ఎంఈవో గౌరమ్మ ఉన్నారు.

బిక్కవోలు ఆరుగురు గైర్హాజరు

బిక్కవోలు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షల్లో శుక్రవారం జరిగిన ఇంగ్లీషు పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వివి. సత్యనారాయణ తెలిపారు. బలభద్రపురం సెంటర్‌లో ఇద్దరు, పందపాక సెంటర్‌లో నలుగురు విద్యార్థులు హాజరు కాలేదన్నారు.

నేడు నీటి కుంటలకు శంకుస్థాపన

రాజానగరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో రైతుల పొలాల్లో ఫార్మ్‌ఫాండ్స్ (నీటి కుంటలు) శంకుస్థాపన కార్యక్రమాన్ని మండలంలని తోకాడలో శనివారం మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారుల చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జేపీ ఝాన్సీ తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా అధికారులు హాజరుకానున్నారన్నారు.

ఒంటి పూట బడులు ముగిసే వరకు

భోజనంలో మజ్జిగ

మధ్యాహ్న భోజనం జిల్లా కో-ఆర్డినేటర్ రామకృష్ణ



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న రామకృష్ణ

కడియం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరికీ వచ్చేనెల ఒంటి పూట బడులు ముగిసే వరకు ప్రతీ రోజు మధ్యాహ్నం భోజనంలో మజ్జిగ ఇవ్వడం జరుగుతుందని ఎండీఎం జిల్లా కో - ఆర్డినేటర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం వేమగిరి తోట నెం-1 ఎంపీపీ పాఠశాలను రామకృష్ణ తనిఖీ చేసారు. దీనిని ప్రతీ సంవత్సరం వలెనే ఈ ఏడాది కూడా మజ్జిగ పథకాన్ని ప్రారంబించి నిరాటంకంగా కొనసాగించడం హర్షణీయం అని తెలిపారు. ఈ సందర్భంగా మజ్జిగను విద్యార్థులకు పంపిణీ చేసారు. ఆహార పధార్థాల వివరాలను, కిచెన్‌గార్డెన్ నిర్వహణను పరిశీలించారు. హెచ్ఎం జయరాజు, సర్వశిక్ష ఇంజనీర్ వీరభద్రరావు ,ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

రాజానగరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన కరెడ్ల రాంబాబు అదృశ్యమైనట్టు భార్య కరెడ్ల కుసుమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాంబాబు తాపీపని చేసుకుంటూ ఆర్థిక భారంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న ఉదయం 11గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదని, కుసుమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్.ఐ నాగార్జున కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతులకు ప్రణాళికాబద్ధంగా సూచనలు అందించాలి

ఏరువాక శాస్త్రవేత్త శ్రీనివాసరావు

అనపర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగే విధంగా రైతులను సమాయత్తం చేయాలని ఏరువాక శాస్త్రవేత్త శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం అనపర్తిలోని రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్‌కు సంబంధించి చేపట్టాల్సిన ప్రణాళికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వచ్చే తెగుళ్ళు వాటి నివారణకు చేపట్టాల్సిన అంశాలపై శిక్షణనిచ్చారు.

‘ఆదరణ-3’ను సద్వినియోగం చేసుకోండి

అవగాహన సమావేశాల్లో రాజానగరం, రంగంపేట, బిక్కవోలు ఎంపీడీవోలు

రాజానగరం/రంగంపేట/బిక్కవోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తులను ప్రోత్సహించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించిన ఆదరణ-3 పథకాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని రాజానగరం, రంగంపేట, బిక్కవోలు ఎంపీడీవోలు జేపీ ఝాన్సీ, సాయిబాబు, వి.శ్రీనివాస్ చెప్పారు. మండలంలో బీసీ కులాలకు చెందిన కుల వృత్తుల వారికి అవసరమైన పనిముట్లు మంజూరులో భాగంగా ఆయా మండల పరిషత్ కార్యాలయాల వద్ద అవగాహన/అభి ప్రాయ సేకరణ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆయా కుల వృత్తులకు సంబంధించి అవసరమైన పనిముట్లు అందించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకంలో కులవృత్తుల వారికి రాయితీపై పనిముట్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. వృత్తిదారులకు ఆధునిక పనిముట్లు నాణ్యతాపరమైన మంచి కంపెనీలు, ఏజన్సీల ద్వారా అందించుటకు, ఆయా వృత్తిదారులకు ఏ పనిముట్లు కావలెనో, పంపిణీదారుల సమాచారం సేకరించుటకు ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఎంపీడీవోలు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో రాజానగరం మండల పరిషత్ ఏవో ఎం.సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ వాణి, బిక్కవోలు మండల పరిషత్ పరిపాలనాధికారి వీడీ రత్నకుమార్, సీనియర్ అసిస్టెంట్ మంగరాజు, పంచాయతీ కార్యదర్శులతోపాటు, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గోకవరం, మార్చి21(ఆంధ్రజ్యోతి) యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉండాలంటూ ఎస్ఐ పవన్‌కుమార్ అన్నారు. గోకవరంలో ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డిపో సెంటర్ సమీపంలో యువకులు, పోలీస్ సిబ్బంది ప్లకార్డులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించడంతోపాటు, వాటిని కలిగి ఉండడం వల్ల తీసుకునే చట్టపరమైన చర్యలను తెలియజేశారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత కృషి చేయాలని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ యువతతో ప్రతిజ్ఞ చేయించారు.

వేసవి నష్టాలను సమష్టిగా ఎదుర్కొందాం

ఎంపీడీవో రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమష్టి కృషి ద్వారా వేసవిలో జరిగే నష్టాలను ఎదుర్కొనాలని ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వేసవిలో జరిగే అగ్ని ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేసే దిశగా కృషి చేస్తామన్నారు. విద్యాశాఖాదికారి నల్లమల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ ఒంటిపూట సెలవుల్లో అదనపు తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తప్పవన్నారు. ఈవోపీఆర్‌డీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూటమితో ఉద్యోగుల జీవితాల్లో పండుగ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఉద్యోగుల జీవితాల్లో పండగ తీసుకువచ్చిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రూ6,200 కోట్లు బకాయిలు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఒక చరిత్ర అని అన్నారు. సీపీఎస్, జీపీఎఫ్, ఏపీజీఏఐ బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించనుందన్నారు. ఈ ఏడాది జనవరి 11న ఉద్యోగుల వివిధ బకాయిలు చెల్లించిన ప్రభుత్వం జనవరిలో రూ1033 కోట్లు బకాయిలు విడుదల చేసిందన్నారు. ఏపీలో గత ఐదేళ్లలో ఉద్యోగుల పరిస్థితి అత్యంతం దుర్భరంగా ఉండేదని నెలంతా కష్టపడిన వేతనాలు కోసం ఉద్యోగులు ఉ ఎదురు చూసే పరిస్థితి వుండేదని కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి పేర్కొన్నారు.

పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు

కోరుకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు వినతిపత్రాలు అందించారు. జనవాణి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వినతులు అందజేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డు, వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీల సమస్యలతో పాటు పంటలు దెబ్బతిన్న రైతులు సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు మాదిగ దండోర నాయకులను, కార్యకర్తలను ఎమ్మెల్యే బత్తుల ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం ఈ స్థాయి వరకు రావడానికి కారణం మందకృష్ణ మాదిగ అని గుర్తుచేశారు. మాదిగ కులం అని గర్వంగా చెప్పుకునే స్థాయిలో మందకృష్ణ ఉద్యమాన్ని నడిపించారని అన్నారు. ఎస్సీ వర్గాల్లో ఉన్న లోటుపాట్లను సవరించి వర్గీకరణ అమలు చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు మాదిగ దండోరా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వ్యాధుల నిర్ధారణకు వైద్య శిబిరం

అనపర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ మహమ్మారిపై గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రస్తావించడంతో స్పందన లభించింది. శనివారం బలభద్రపురంలో అనపర్తి, కడియం, కొవ్వూరుకు చెందిన వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా మెడికల్ హెల్త్ అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ టీవీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఐదుగురు డాక్టర్ల బృందం గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో బాటు వివిద వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రతిఒక్కరూ ఒక్కొక్క మొక్కను దత్తత తీసుకోవాలి

రాజమహేంద్రవరం సీసీఎఫ్ మూర్తి

దివాన్‌చెరువు, మార్చి21 (ఆంధ్రజ్యోతి) ప్రకృతిలో ఒక్కొక్క మొక్కను దత్తత తీసుకుని వాటిని సంరక్షించాలని రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎన్ఎన్ మూర్తి కోరారు. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కరవనంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవంను శుక్రవారం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించిమాట్లాడారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించవలసిన అవసరాన్నివివరించారు. మొక్కలను దత్తత ఇచ్చేకార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు అందజేశారు.





జిల్లా పోలీసులకు ఉగాది పతకాలు


మురళీకృష్ణ


ఏవీ సుబ్బరాజు


అస్మా పర్హీన్

రాజమహేంద్రవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కారాలు-2025 సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన వివిధ సేవా పతకాల్లో జిల్లాలోని పోలీసు, ఫైర్, విజిలెన్స్, సీఐడీ, ఏపీ ఎస్పీఎఫ్ శాఖలకు పతకాల పంట పండింది. అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎన్‌బీఎం మురళీ కృష్ణకు మహోన్నత సేవా పతకం దక్కింది. అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు, సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్ సేవా పతకం సాధించా రు. ఏఆర్ ఎస్ఐ(902) జీవీ సత్యనారాయణ మూర్తి ఉత్తమ సేవా పతకం,డీసీఆర్‌బీ ఎస్ఐ ఎల్.కనకరాజు, ఏఆర్ ఎస్ఐ వీ.వెంకట గిరి(2968), ఏఆర్ హెచ్‌సీ(206) టి.సతీశ్ బాబు, ఉండ్రాజవరం ఏఎస్ఐ కె.రామకృష్ణ, చాగల్లు ఏఎస్ఐ వై.రాజేంద్రప్రసాద్, అనపర్తి హెచ్‌సీ పి.రఘు, బొమ్మూరు పీఎస్ పీసీ కేఎస్ సుబ్రహ్మణ్యం సేవా పతకం లభించింది.ఫైర్ సర్వీసు నుంచి రాజమహేంద్రవరం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మ్యాన్ పి.గణేశ్వరరావు, డ్రైవర్ ఆపరేటర్ ఎల్.దుర్గాప్రసాద్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలోని ఐవోపీ టి.నాగ వెంకట రాజు, ప్రత్యేక రక్షణ దళం నుంచి ఎయిర్‌పోర్టు ఏఎస్ఐ ఎం.శ్రీనివాస రెడ్డికి ఉత్తమ సేవా పతకం లభించాయి. ఓఎన్‌జీసీలో సీటీ (2215) కె.కృష్ణారావు, హెచ్‌సీ(1472) వై.రాజశేఖరానికి సేవా పతకం లభించాయి.

మురుగు..గోదారి!

భక్తజనం గోదావరిని ఎంతో ప్రత్యేకంగా చూస్తారు.. ఒక్కసారైనా ఆ నదిలో స్నానం చేయాలని ఎంతో మంది మొక్కుకుంటారు.. అంత పవిత్రమైనదిగా భావిస్తారు.. ఇప్పటికీ ఎక్కడెక్కడి నుంచో వచ్చిన భక్తజనం స్నానాలు ఆచరిస్తారు... అంతటి పవిత్రత ఉన్న గోదావరిని అపవిత్రం చేస్తున్నారు.. రాజమహేంద్రవరం నగరంలో వచ్చే మురుగంతా గోదావరిలోకి వదిలేస్తున్నారు.. నదీ పరీవాహక ప్రాంతంలో ఎక్కడ చూసినా.. పుష్కరఘాట్..కోటిలింగాల ఘాట్.. సరస్వతి ఘాట్.. గౌతమి ఘాట్.. ఇలా ఏ ఘాట్ చూసినా చెత్తతో దర్శనమిస్తోంది.. మరో వైపు భక్తితో నెత్తిపై నీళ్లు పోసుకుందామని దిగామా పైకి తేలేది బురదనీరే.. ఇక ధవళేశ్వరం వద్ద అయితే ఆవ కాలువకు చెందిన మురుగు బోదెను గోదావరిలోకి పెట్టేస్తున్నారు.. మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నద్ధం చేస్తోంది..ఇప్పటికైనా గోదావరిలో కలిసే మురుగునీరు దారి మళ్లించకపోతే ప్రమాదమే మరి.. నేడు అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరిపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్..

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం




ఆసుపత్రిలో సిబ్బందితో చర్చిస్తున్న అడిషనల్ డీఎంఈ వెంకటేశ్వరరావు

వైద్యులు డ్యూటీలకు సకాలంలో ఎందుకు రావడంలేదు?

బోధనాసుపత్రి తనిఖీలో ఏడీఎంఈ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు సకాలంలో డ్యూటీలకు రాకపోవడంపై డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్‌పేషెంట్ విభాగంతో పాటు కీలకమైన అన్ని విభాగాలను సందర్శించారు. వైద్యుల హాజరును పరిశీలించారు. ఆర్ఎంవో ప్రణవ్‌ను వెంటబెట్టుకుని ఆసుపత్రిలోని ఓపీ విభాగాలు, ఐసీయూలు, వార్డుల్లో తిరిగారు. కొంతమంది రోగులతోను మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. న్యూరో విభాగంలో సర్జరీలు ఎందుకు చేయడంలేదని ప్రశ్నిం చగా ఎక్విప్‌మెంట్ లేకపోవడం వల్ల సీరియస్ కేసులను కాకినాడ రిఫర్ చేయాల్సి వస్తోందని వివరించినట్టు తెలిసింది.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఉద్యోగులు ఈనెల 24, 25 తేదీల్లో జరపతలపెట్టిన సమ్మె వాయిదా పడింది.సెంట్రల్ లేబర్ కమిషనర్ శుక్రవారం వివిధ సమస్యలపై బ్యాంకు ఉద్యోగులతో జరిపిన చర్చల్లో సానుకూలత కనిపించడంతో సమ్మె వాయిదా వేసినట్టు బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మీపతిరావు, యూనియన్ నాయకులు శేషుకుమార్, పాపారావు తెలిపారు. సోమ, మంగళవారం బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

మినరల్ వాటరే.. తాగండి పరవాలేదు.. ఇదీ ప్రస్తుతం ఎక్కడికి వెళ్లినా గ్లాసుతో నీళ్లిచ్చి ముందుగా చెప్పే మాట.. చాలామంది దృష్టిలో బయట నుంచి కొని టిన్నులతో తెచ్చుకుంది మినరల్ వాటర్ కింద లెక్క.. ఆ నీరు ఎంత వరకూ సురక్షితమంటే కాస్త ఆలోచించాల్సిందే మరి.. ప్లాంట్ నీళ్లు తెచ్చుకున్నంత మాత్రాన సురక్షితం కాదు సుమా..! ఏదో మినరల్ వాటర్ తాగుతున్నామని పైకి చెప్పుకోవడం తప్ప.. బోరు వాటర్ కంటే అధ్వానమే మరి.. ఒకసారి మీరు మంచినీళ్లు తెచ్చుకునే ప్లాంట్‌కు అని అనుమతులు ఉన్నాయో లేదో చూస్కోండి.. లేదంటే మీ ఆరోగ్యం గోవిందా!?



సుజలమేనా!

నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నారు

- మినరల్ పేరిట మోసం
- ప్యాకెట్లు.. బాటిళ్లతో సరఫరా
- పుట్టగొడుగుల్లా ప్లాంట్‌లు
- ఉమ్మడి జిల్లాలో 3 వేలు పైనే
- కనీస నిబంధనలూ కరువే
- ఐఎస్ఐ ప్రమాణాలు గాలికి
- జనం ఆరోగ్యంతో జలగాటం
- కన్నెత్తి చూడని అధికారులు
- మామూళ్ల మత్తు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మినరల్ వాటర్ అనుకుంటూ లీటరు రూ.20 పెట్టికొంటున్నాం. మినరల్స్ మాట దేవుడెరుగు.. అసలు అవి సురక్షిత తాగునీరేనా? అంటే ఆలోచించాల్సిందే. కలుషిత నీటి వల్ల వివిధ రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నా యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. దీంతో వాటర్ ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేక మామూలు నీటిని నింపేసి నీళ్లలా డబ్బును దోచేస్తున్నారు. ప్యాకెజ్డ్, ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ రంగం వేల కోట్ల రూపాయల వ్యాపారమైపోయింది. నేడు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా వాటర్ ప్లాంట్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

పుట్టగొడుగుల్లా..

తాగునీరు ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్) ప్రమాణాల ప్రకారం ఉండాల్సిందే. కానీ వాటర్ ప్లాంట్ల విషయంలో అది అమలుకావడం లేదు. వాటర్ ప్లాంటు పెట్టాలంటే బోరుకు వాల్టా చట్ట ప్రకారం స్థానిక సంస్థలు తదితర అనుమతులు ఉండాలి. నీరు శుద్ధి చేసిన తర్వాత ప్యాకెట్లు, బాటిళ్లలో ప్యాక్ చేసి విక్రయించాలంటే కచ్చితంగా ఐఎస్ఐ ఉండాలి. ప్రభుత్వ అధికారులు వచ్చి ల్యాబ్‌తో సహా ఉన్నాయా లేదా అనేది పూర్తిగా తనిఖీలు చేస్తారు. నమూనాలను మైక్రో బయాలజీ ల్యాబ్‌లకు పంపించి పరిశీలిస్తారు. ఇది తీసుకున్న తర్వాత ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికెట్ ఇస్తారు. ఇవి ఉంటేగానీ ప్యాక్ చేసి అమ్మడానికి వీల్లేదు. ఐఎస్ఐ లైసెన్స్‌కి ఏడాదికి రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం చాలా మంది వాటర్ ప్లాంట్ల యజమానులు నిబంధనలకు నీళ్లొదిలేశారు. లూజ్ వాటర్ పేరుతో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, నాసిరకం వాటర్ ప్యాకెట్లలో నీటిని నింపి విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం లూజ్ వాటర్‌కి ఐఎస్ఐ10500 ప్రకారం నాణ్యతా ప్రమాణాలు ఉండాలి. వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లప్లాస్టిక్‌లో నాణ్యతా ప్రమాణాలూ పాటించడం లేదు. చాలా ప్యాకెట్లలో నీరు ప్లాస్టిక్ వాసన వస్తుంటుంది. ఐఎస్ఐ కలిగిన బ్రాండెడ్ కంపెనీల లీటరు వాటరు బాటిల్ రూ.12-14 ఉంటే, నాసిరకం రూ.7-8కే దొరుకుతుంది. లాభం ఎక్కువగా వస్తుందనే కక్కుర్తితో నాసిరకం నీటినే అధికశాతం అమ్మకాలు సాగిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐఎస్ సర్టిఫికెట్ కలిగినవి కేవలం 10 వరకూ ఉంటే, లేనివి 3 వేల పైమాటే. అసలు ఎన్ని వాటర్ ప్లాంట్లు ఎక్కడెక్కడ ఉన్నాయనే లెక్క యంత్రాంగం వద్ద లేకపోవడం గమనార్హం.



తాగునీటి ప్రమాణాలివే..

తాగునీరు కచ్చితంగా ఐఎస్ఐ ప్రమాణాలకు లోబడి ఉండాల్సిందే.ప్యాకెజ్డ్ తాగునీరు ఐఎస్ఐ 14543 ప్రమాణాలు పాటించాలి. టీడీఎస్ సున్నా నుంచి 500 వరకూ ఉండాలి. మినరల్ వాటర్ ఐఎస్ఐ 13428 ప్రమాణాలతో టీడీఎస్ 150- 500 ఉండాలి. నాచురల్ డ్రింకింగ్ వాటర్ ఐఎస్ఐ10500 ప్రమాణాలు కలిగి టీడీఎస్ 0-2 వేలు వరకూ ఉండొచ్చు. ఏదైనా పీహెచ్ మాత్రం 6 కంటే తక్కువ 8.5 కంటే ఎక్కువ ఉండరాదు. టీడీఎస్ అనేది ప్రాంతాలను బట్టి మారుతుంటుంది. గోదావరి నీటిలో 150 ఉంటే, కృష్ణా నీటిలో 350 వరకూ ఉంటుంది. వర్షం నీటిలో అసలు టీడీఎస్ ఉండదు. ఆమ్ల గుణం ఉంటుంది. బోరు నీటిలో టీడీఎస్ 10 నుంచి 15 వేల వరకూ ఉంటుంది. రివర్స్ ఓస్మాసిస్ ప్రక్రియ అనేది టీడీఎస్ తగ్గించడానికి చేస్తారు. దీని వల్ల 50% నీరు వృథా కావడంతోపాటు అవసరమైన లవణాలు పోతాయి. దాంతో లవణాలు కలిపి మినరల్ వాటర్‌గా అమ్ముతారు. అల్ట్రా వయోలెట్, అల్ట్రా ఫిల్టరేషన్ ప్రక్రియ ద్వారా బ్యాక్టీరియా మాత్రమే నశిస్తుంది.

నేడు జల దినోత్సవం

తాగునీటి ప్రాముఖ్యత, వినియోగమే ఉద్దేశంగా 1993 నుంచీ మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 2030 నాటికి సురక్షిత తాగునీరు, పారిశుధ్య రంగాల్లో సుస్థిర అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే దీని లక్ష్యంగా అమలు చేస్తున్నారు. 'హిమానీ నదం సంరక్షణ' థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

మనమే పరీక్షించుకోవచ్చు..?

మనం తాగేనీటిలో మెగ్నీషియం, కాల్షియం, సోడియం, పొటాషియం, ఇనుము, రాగి, జింక్ వంటివి కలిసిపోయి ఉంటాయి. వీటన్నింటినీ కలిపి మొత్తం కలిగి ఉన్న లవణాలు లేదా టోటల్ డిసాల్వుడు సాలిడ్స్ (టీడీఎస్) అంటారు. టీడీఎస్‌తోపాటు పీహెచ్ స్థాయిలను బట్టి ఆ నీళ్లు మనం తాగొచ్చా లేదా అనేది నిర్ధారిస్తారు. టీడీఎస్ ఎక్కువగా ఉన్నా, పీహెచ్ స్థాయి 6 కంటే తక్కువగా 8.5 కంటే ఎక్కువగా ఉంటే రోగాల బారిన పడడం ఖాయం. టీడీఎస్, పీహెచ్ మీటర్లు బయట మార్కెట్లో దొరుకుతాయి. వాటితో మనం తాగేనీరు పరీక్షించవచ్చు.

నీళ్లు తాగితే.. రోగాలే?

నిర్ధారిత ప్రమాణాల ప్రకారం లేని నీటిని తాగితే రోగాల బారిన పడక తప్పదు. తాగు నీటిలో బ్యాక్టీరియా, వైరస్‌లు ఉండకూడదు. పీహెచ్ 6 కంటే తక్కువ 8.5 కంటే ఎక్కువ ఉండొద్దు. టీడీఎస్ కూడా అత్యధికంగా 2 వేలకు మించరాదు. అలా లేకపోతే అల్సర్లు, ఎసిడిటీ, అజీర్తి, ఉదర సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రిక్, మోకాళ్ల నొప్పులు వంటివి వస్తాయి.



కేసులు.. జరిమానాలు

మిస్ బ్రాండింగ్ అంటే లేబుల్‌పై ప్రచురించిన ప్రకారం ఉండకపోతే రూ.3 లక్షల వరకూ జరిమానా విధిస్తారు. పీహెచ్ విలువ నిర్ధారించిన దానికంటే తక్కువగా ఉంటే రూ. 5 లక్షల వరకూ జరిమానా వేస్తారు. అన్‌సేఫ్.. అంటే ప్రజల ఆరోగ్యానికి హానికరం అని తేలితే కోర్టులో కేసు వేస్తారు. విచారణలో నేరం రుజువైతే రూ.5 లక్షల వరకూ జరిమానా లేదా 6 నెలల జైలు లేదా రెండూ విధించే అవకాశం ఉంది.

ఫామ్ పాండ్స్ తీర్చిదిద్దాలి

కలెక్టర్‌తో డిప్యూటీ సీఎం పవన్

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఫామ్ పాండ్స్ (వ్యవసాయ చెరువులు) పంట సంజీవినిగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి పల్లె పండుగ పనుల పురోగతిపై శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫామ్ పాండ్స్ పనులకు శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టడంపై ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన 1500 లక్ష్యాలను సాధించేందుకు ఇప్పటి వరకు 894 (59.53 శాతం) యూనిట్లకు పరిపాలనా ఆమోదం కోసం మంజూరు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన లక్ష్యాలు సాధించేందుకు క్షేత్ర స్థాయి అధికారులు తగిన ప్రతిపాదనలు అందజేయాలన్నారు. జూన్ నెలాఖరు నాటికి జిల్లాకి నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు పగడ్బందీ కార్యాచరణ అందజేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మరో 80 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.



బైండోవర్ కేసులు పెంచాలి

ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

రాజమహేంద్రవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బైండోవర్ కేసుల సంఖ్యను పెంచాలని డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. ఉత్తర, దక్షిణ ఎక్సైజ్ స్టేషన్లను శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సారా, బెల్ట్ షాపులు, గంజాయి కేసుల గురించి ఆరాతీశారు. సారా రహిత గ్రామాలపై చర్చించారు. నవోదయం 2.0, సారా అరికట్టడంపై సూచనలు చేశారు. గంజాయి తదితర నిషేధిత మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించే దిశగా చర్యలు వేగ వంతం చేయాలని, నేరాలు అదుపుచేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు.


తిరుమల శ్రీనివాస మెడికల్ ఏజెన్సీలో తనిఖీలు చేసి.. ట్రమడోల్ ఇంజక్షన్ల బాక్సు చూపుతున్న విజిలెన్స్ ఎస్పీ స్నేహిత

మెడికల్ షాపులపై విజిలెన్స్

జిల్లాలో 16 చోట్ల దాడులు చేసిన విజిలెన్స్ ఎస్పీ స్నేహిత

రాజమహేంద్రవరం, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శుక్రవారం మందుల షాపులపై అధికారులు దాడులు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈగల్ టీమ్, డ్రగ్ కంట్రోలు డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. నార్కోటిక్ మందులు (మత్తు మందులు) విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎం.స్నేహిత దాడులు చేసినట్టు డ్రగ్స్ కంట్రోలు డిపార్ట్‌మెంట్ రాజమహేంద్రవరం ఏడీ డి.నాగమణి తెలిపారు. కొన్ని మందుల షాపుల్లో నార్కొటిక్(ఎన్ఆర్ఎక్స్- మత్తు) మందులు బిల్లులు లేకుండా డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయించడం గమనించామని,ఆ మందుల షాపులపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని తిరుమల శ్రీనివాసా మెడికల్ ఏజెన్సీలో ట్రమడోల్ ఇంజక్షన్లు గుర్తించారు. అక్కడి లెక్కల ప్రకారం 1000 ఉండాలి.. కానీ 250 అమ్మేశారు. ఎవరికి అమ్మారు, ఎలా అమ్మారో వివరాలు లేవు. దీనిపై విచారణ చేస్తామని ఎస్పీ ఎం.స్నేహిత తెలిపారు. పద్మజ మెడికల్ ఏజెన్సీ, లైఫ్ మెకికల్ స్టోర్, సాయి మెడికల్ ఏజెన్సీల్లో దాడులు జరిగాయి. జిల్లా లో 16 చోట్ల దాడులు నిర్వహించారు. పలు చోట్ల మత్తు మందులు దొరికినట్టు తెలిసింది. రాత్రి కూడా దాడులు నిర్వహిస్తున్నారు.

రూ.10 లక్షల డ్వాక్రా సొమ్ము గోల్‌మాల్


17న డీఆర్‌డీఏ పీడీకి సమస్యను విన్నవిస్తున్న కడియపులంకకు చెందిన డ్వాక్రా మహిళలు

- కడియపులంకలో ఘటన
- 20 నెలలు కాజేసిన వీవోఏ
- గతేడాది విచారణ.. తేలిన వైనం
- బ్యాంకుకు కట్టాలని డిమాండ్
- కలెక్టర్‌కు సభ్యుల విన్నపం

కడియం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కడియపులంకలో ఒక డ్వాక్రా గ్రూపునకు సంబంధించి రూ.10 లక్షలు అవకతవకలు జరిగినట్టు సభ్యులు ఆరోపిస్తున్నారు. శాంతిశ్రీ సంఘం, సాయిమణికంఠ గ్రూపుగా 10 మంది సభ్యులు ఏర్పాటు చేసుకున్నారు. 2022 సంవత్సరంలో బ్యాంకు నుంచి తీసుకున్న డ్వాక్రా రుణ వాయిదా చెల్లింపులు వీవోఏ నాగవేణి నెలకూ రూ.50 వేలు చొప్పున 20 నెలల పాటు రూ.10 లక్షలు తీసుకుంది. దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ చేసి రూ.10 లక్షలు అవకతవకలు జరిగినట్టు గుర్తించినట్టు సభ్యులు చెబుతున్నారు.అనంతరం కదలిక లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ నెల 17వ తేదీన మరో మారు కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.ఇదిలా ఉండగా వీవోఏ నాగవేణి వద్ద ఉన్నప్పుడు డబ్బులు కడుతుంది అం దుకు మీరు అంగీకరిస్తూ కాగితాలపై సంతకాలు పెట్టండంటూ ఏపీఎం నాగలక్ష్మి తమపై ఒత్తిడి తెస్తున్నారని సంఘ అధ్యక్షురాలు ప్రగడరెడ్డి ఉమాదనేశ్వరి, సెక్రటరీ కోలా వీరలక్ష్మి, సంఘం సభ్యులు తెలిపారు.రూ.10 లక్షలు వెంటనే బ్యాంకుకు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

రూ.10 లక్షలు పక్కదారి పట్టించారు : ప్రగడరెడ్డి ఉమాధనేశ్వరి



ప్రతి నెలా రూ. 50 వేలు చొప్పున 20 నెలల పాటు చెల్లించాం. మేము ఇచ్చిన సొమ్ములు బ్యాంకుకు జమ కాలేదు. ఏడాది కిందట జరిగిన విచారణలో సుమారు రూ.10 లక్షలు అవకతవకలు జరిగినట్టు అధికారులు గుర్తించారు.అయినా నేటి వరకూ మా సొమ్ములు మాకు ఇప్పించలేదు.

రేపు ఎఫ్ఎల్ఎన్ఏటీ టెస్ట్

రాజమహేంద్రవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఎల్ఎన్ఏటీ)ని 143 కేంద్రాల్లో ఈ నెల 23న నిర్వహి స్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు ఎన్‌వీవీఎస్.మూర్తి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో తూర్పుగోదావరిలో గత నవంబరు నుంచి స్వయం సహాయక సంఘాల్లో చదువుకోని మహిళలకు అదే బృందంలో చదువుకున్న వారితో చదువు చెప్పించడం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకూ 509 మంది ఆధ్వర్యంలో 5,087 మంది అభ్యాసకులకు శిక్షణ తరగతులు నిర్వ హించామని చెప్పారు.వారు ఏ మాత్రం పురోగతి సాధించారనే అంచనా కోసం ఈ టెస్ట్ పెడుతున్నారన్నారు.ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తిస్తూ జాతీయ సాక్షరత విద్యాసంస్థ అధికారిక ధ్రువీకరణ పత్రం అందజేస్తుందన్నారు.

నేటి నుంచి నిర్మలగిరి ఉత్సవాలు 8
31 మంది ఏఎస్ఐలకు పదోన్నతి 7

గ్రామాల్లో రీసర్వేకు రైతులు సహకరించాలి


సత్యవాడలో మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మీనారాయణ

ఉండ్రాజవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రీసర్వేకు రైతులంతా సహకరించాలని సర్వే అండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బీ. లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం సత్యవాడలో రీ సర్వేపై గ్రామసభను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రీసర్వే వల్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, వారి భూమి వివరాలు ఖచ్చితంగా వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ టీ. వెంకటేశ్వరావు, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు ప్రభావతి, ఉపసర్పంచ్ ప్రసాదరాజు, మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎండలపై అప్రమత్తత అవసరం : కమిషనర్


సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సచివాలయ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి సచివాలయంలో ఒక కుండలో తాగునీటిని ఏర్పాటుచేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా చూడాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ పీ. సాయిబాబు, టీపీవో టీ. మణిరామ్, ఏఈలు సుమంత్, సందీప్, భరత్, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ


పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, సిబ్బంది

తాళ్లపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంకలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శుక్రవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి అందించారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా పంపిణీ చేస్తునట్టు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ హరికాగుప్త, సూపర్‌వైజర్ భాగ్యకుమారి, టీచర్ ఉమ, ఎంఎల్‌హెచ్‌పీ సుధారాణి, ఆశావర్కర్ పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు


తాళ్లపూడిలో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న ఏపీవో రమాదేవి

తాళ్లపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి పెరట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం వల్ల భూగర్భజలాల పెంపుదలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ఎంజీఎన్ఆర్ ఏపీవో రమాదేవి తెలిపారు. మండలంలోని పలుచోట్ల ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడుతున్నామని, ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యంతో మండలంలో 63 ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆమె తెలిపారు. శుక్రవారం ప్రక్కిలంకలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతను శుక్రవారం ఆమె పరిశీలించారు.

కొనసాగుతున్న.. పదో తరగతి పరీక్షలు

దేవరపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు సెంటర్లలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 1024 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 995 మంది మాత్రమే హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారులు తిరుమలదాసు, అప్పారావు తెలిపారు.

సత్యసాయి నీరే కారణం

• గోపాలపురంలో ప్రబలిన డయేరియా
• ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
• నిర్ధారించిన ల్యాబ్ రిపోర్టులు


పెద్దగూడెంలోని సత్యసాయి వాటర్ ట్యాంకు

గోపాలపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండల కేంద్రంలో ప్రబలిన డయేరియాకు సత్యసాయి నీటిసరఫరాయే కారణమని ల్యాబ్‌పరీక్షలతో నిర్ధారణ అయ్యింది. ఈ నెల 18న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇటీవల డయేరియా వ్యాధి బారినపడి ప్రజలు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. దీనికి కారణం సత్యసాయి నీరు వాడకమేనని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. ఈ కథనం కూడా నీటి నమూనాల పరీక్షల అనంతరం వచ్చిన రిపోర్టుతో నిర్ధారణ అయ్యింది. మండలంలో ఆయా గ్రామాల నుంచి 13 చోట్ల నీటి నమూనాలు, ఒక వ్యక్తికి చెందిన మల నమూనాను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిం చారు. వాటిలో పెద్దగూడెం సత్యసాయి వాటర్ ట్యాంకు, ఉప్పరగూడెం సత్యసాయి వాటర్ ట్యాంక్, వేలచింతలగూడెంలో ఉన్న సత్యసాయి వాటర్‌ట్యాంక్, పెద్దాపురంలో సత్యసాయి వాటర్‌ట్యాంక్‌తో పాటు పెద్దగూడెంకు చెందిన సీ.నాగేశ్వరరావు, వేలచింతల గూడెంకు చెందిన రామారావు, పెద్దాపురానికి చెందిన నాగమణి, చిట్యాలకు చెందిన జ్యోతిక, తదితరులు సేకరించిన నీటినమూనాల్లో బాక్టీరియా ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. అనంతరం అధికారులు చర్యలు చేపట్టారు.

మతసామరస్యానికి ప్రతీక 'నిర్మలగిరి'

• నేటి నుంచి పుణ్యక్షేత్రంలో ఉత్సవాలు ప్రారంభం • మేరీమాతను దర్శించుకోనున్న హిందూ, ముస్లింలు




గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రధాన ఆలయం

దేవరపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం ఎంతో పేరుగాంచింది. గౌరీపట్నం పుణ్యక్షేత్రంలో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, పుణ్యక్షేత్ర డైరెక్ట జాన్‌పీటర్ ఆధ్వర్యంలో శనివారం జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో వస్తుంటారు.గత 40 సంవత్సరాలుగా ఉత్సవాలు ప్రతిఏటా మార్చి 22 నుంచి 25 వరకు జరుగుతుంటాయి. ఏలూరు పీఠాధిపతి జాన్‌ములగాడ ఏలూరు నుంచి విశాఖపట్నం వెళ్తూ మార్గమధ్యలో గౌరీపట్నం సమీపంలో కారుకు అంతరాయం ఏర్పడటంతో ఆ ప్రాంతంలో అప్పట్లో ఆ పీఠాధిపతి అయిన జాన్ ములగాడరు సాక్షాత్తు మేరీమాతను సాక్షాత్కరించి నాకు ఆలయం నిర్మించాలని ములగాడకు ఆలోచింపచేసింది. గౌరీపట్నం హైవే పక్కన గల కొండ వద్ద ఆలయ నిర్మాణానికి సమయక్తమయ్యారు. గౌరీపట్నం ప్రముఖులు గ్రామపెద్దలతో సంప్రదించి భూసేకరణ చేసి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి కొండపైన ఆలయాన్ని, రోడ్డు పక్కన గేటు సమీపంలో మేరీమాత మందిరాన్ని ఏర్పా టుచేశారు. ఈ పుణ్యక్షేత్రాన్ని క్రైస్తవులతోపాటు హిందువులు కూడా దర్శించు కోవడం విశేషం. మేరీమాత డైరెక్టర్‌గా ఫాదర్ ఆరోన్ దిరిసన బాధ్యతలు చేపట్టి ప్రధాన ఆలయా నికి నిర్మించారు. 2000వ సంవత్సరంలో నిర్మలగిరి పుణ్య క్షేత్రంలో అన్ని హంగులతో ప్రధాన దేవాలయం నిర్మాణం జరిగింది. ఈ క్రమంలో ఏలూరు పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టిన పొలిమేర జయరావు ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్‌గా ఫాదర్ రాయప్ప రెండు సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించారు. ఈ ఆలయంలో ముఖ్యంగా తలనీలాలు సమర్పించటం, కొబ్బరికాయలు కొట్టడం లడ్డూలు భక్తులు అందజేయడం, కొవ్వొత్తులు వెలిగించటం చేస్తుంటారు. ఇక్కడ నిత్యాన్నదానం ఉంటుంది. అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు భక్తులు సౌకర్యార్థం కూలింగ్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. పుణ్యక్షేత్రంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుం డా సీసీ కెమెరాలు ఏర్పాటు, 200 మంది వలంటీర్లను నియమించారు. ఈ ఉత్సవాలకు పలు రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు హాజరుకానున్నట్టు జాన్‌పీటర్ తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలోని నందమూరు జంక్షన్ లేఅవుట్ - 3లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, బీసీ, సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు స్థలాలు కేటాయించాలని సీఎం చంద్రబాబుని కోరినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సీఎం పేషీలో సీఎంను కలిసి లేఅవుట్-3లో ఇళ్లస్థలాలకు సేకరించిన భూమిలో ఖాళీగా ఉన్న స్థలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి 5 ఎకరాలు, బీసీ, సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు 5 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రతిపాదనలు అందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

ఆదరణ పథకం సమర్ధవంతంగా అమలు కావాలి : ఎంపీడీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

చాగల్లు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే ఆదరణ పథకం-3 విజయవంతంగా అమలు కావడానికి అందరి సహకారం అవసరమని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అన్నారు. దీనిపై శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, బీసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

నిడదవోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం హయాంలో పట్టణంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 3వ వార్డు కందుకూరి వారి వీధిలో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో మరిన్ని పనులకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎండీ షకీరాబేగం, జనసేన నేతఎండీ ఫయాజ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపురం, మార్చి21 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొమ్మిది అంగన్వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకురాలి పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఇందులో రేగులకుంట, పెద్దాపురం 2, గోపాలపురం మండలాల్లో 9, దేవరపల్లి 10, నల్లజర్ల 1, మార్లమూడి 1, సింగరాజపాలెం 2, తూర్పుచోడవరం 4, ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత కలిగినవారు స్థానికులై ఉండి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే 21 - 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఆరుబయట రోడ్లమీద విక్రయించే శీతల పానీయాలకు దూరంగా ఉండాలని తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ కార్యాలయంలో ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 21 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి ఇంగ్లీషు పరీక్షకు 21 మంది గైర్హాజరయ్యారు. శుక్రవారం పట్టణ, మండలంలోని 10 పరీక్షా కేంద్రాలలో మొత్తం 1258 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 21 మంది గైర్హాజరయ్యారు స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో 76 కి 70, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (గవర్నమెంటు హైస్కూల్) 133కి 131, ఏఎన్‌జీఆర్ గర్ల్స్ హైస్కూల్లో 109 కి 109, డా. సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 95 కి 93, అభ్యాస పాఠశాలలో 130 కి 130, వేములూరు దీప్తి హైస్కూల్లో 148 మందికి 143, భాష్యం పాఠశాలలో 144 కి 139, జడ్పీహెచ్ఎస్, కుమారదేవంలో 118 కి 118, జడ్పీహెచ్ఎస్, వాడపల్లిలో 207 కి 206, జడ్పీహెచ్ఎస్, పంగిడిలో 98 కి 98 మంది విద్యార్థులు హాజరయ్యారు.

50 శాతం సబ్సిడీపై విత్తనాలు : ఏవో


వాడపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో గంగాధర్

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీపై మినుము, పెసర విత్తనాలు అందజేస్తున్నట్టు ఏవో ఎ. గంగాధర్ తెలిపారు. వాడపల్లి, ఆరికిరేవులలోని రైతుసేవా కేంద్రాల్లో గల రైతులతో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వేసవిలో అపరాలు సాగుచేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్నామన్నారు. దీనికి ముందుగా రైతులు రైతుసేవా కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మినుము వీడీఎస్ 8 రకం రూ. 140లకు గాను రూ. 70కు, పెసర విరాట్‌రకం విత్తనాలు రూ.135 గాను రూ. 65కు ఇస్తున్నామన్నారు. మినుము పంట 85 నుంచి 90 రోజులు, పెసర పంట 60 రోజుల్లో చేతికి వస్తుందన్నారు.

ఎండల తీవ్రతను ప్రజలకు వివరించాలి : తహశీల్దార్


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

ఉండ్రాజవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండల తీవ్రతను ప్రజలకు తెలియజేయాలని తహశీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఎండల తీవ్రతపై సిబ్బందికి నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎండలు తీవ్రత వల్ల వచ్చే సమస్యల గురించి ప్రజలకు వివరించాలని వైద్య, ఫైర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం. సందీప్, ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కె. ఆంజేయశర్మ, మండలస్థాయి అధికారులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వాదాలకుంటలో పొగాకు బ్యారన్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గోపాలపురం, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : వాదాలకుంటకి చెందిన జుజ్జువరపు రామలక్ష్మి పొగాకు బ్యారన్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారి అబ్రహం తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే బ్యారెన్‌లో ఉన్న పొగాకు మొత్తం కాలిపోయింది. ఈ సంఘటనలో రూ. ఐదులక్షల ఆస్తినష్టం జరిగినట్టు అగ్నిమాపక అధికారి అబ్రహం గుర్తించారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి నాగలక్ష్మి

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. నాగలక్ష్మి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం సీతంపేట గ్రామ సచివాలయంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్లలో అడ్డదిడ్డంగా లారీల నిలిపివేత


బ్రిడ్జి కింద ఇరువైపులా నిలిపివేసిన లారీలు

నల్లజర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల - పోతవరం రోడ్డులో ఉన్న ఫ్లైఓవర్ కింద ఓ వైపు శీతలపానీయాల దుకాణాలు, మరోవైపు లారీలను అడ్డదిడ్డంగా నిలుపుదల చేస్తుండడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం ఒక లారీ డ్రైవర్ లారీని బ్రిడ్జి కింద ఆపి మద్యం సేవిస్తుండటాన్ని చీపురుగూడెంకి చెందిన చెల్లు సుబ్రహ్మణ్యం, కంపన దుర్గారావు గమనించి సదరు లారీ డ్రైవర్‌ను మందలించారు. అనంతరం పోలీసులకు ఫోన్ చేయడంతో ఆయన లారీతో ఉడాయించాడు. ప్రతి నిత్యం ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ నేషనల్ హైవే అధికారులు గానీ, పోలీసులు గానీ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటుచేయాలి


పాలంగిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటుచేయాలని మండల ప్రత్యేక అధికారి ఎం. సందీప్ పేర్కొన్నారు. శుక్రవారం పాలంగి పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, బాటసారులకు ఉపయోగపడేలా చలివేంద్రాలు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. తహశీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, ఎంపీడీవో రామారావు, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, గ్రామసర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్‌జానీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు డీఎస్పీ జి. దేవకుమార్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల .. ప్రకారం ఈ నెల 19వ తేదీన కొవ్వూరు పట్టణంలోని ఏసీఆర్ లాడ్జి సమీపంలోని పాలింపాటి నరసయ్యనగర్ 23వ వార్డు చిట్టూరివారి వీధికి చెందిన కుందుల పద్మకుమారి సాయంత్రం సమయంలో వాకింగ్ చేస్తుంది. ఈక్రమంలో సీతంపేట మండలం కాటవరానికి చెందిన బొద్దు సూర్యనారాయణ అలియాస్ సూరి అనే వ్యక్తి వెనుక నుంచి వచ్చి పద్మకుమారి మెడలో ఉన్న ఆరున్నర కాసుల రెండుపేటల బంగారపు గొలుసును లాక్కొని బైక్‌పై పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ దేవకుమార్, పట్టణ సీఐ పి. విశ్వం, ఎస్ఐ కె. జగన్మోహనరావులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో సూర్యనారాయణను శుక్రవారం దొమ్మేరు అండర్ పాస్ వద్ద అరెస్టుచేసి, అతని వద్ద నుంచి బంగారపు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చామన్నారు. దొంగతనం జరిగిన ఒక్కరోజులోనే కేసును చేధించి, ముద్దాయిని అరెస్టు చేయడంపై పట్టణ సీఐ పి. విశ్వం, ఎస్ఐ కె. జగన్మోహనరావును జిల్లా ఎస్పీ అభినందించినట్టు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు.

రేపు బహుజన రచయితల సంఘ సమావేశం

చాగల్లు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బహుజన రచయితల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఆదివారం విజయవాడలో నిర్వహిస్తున్నట్టు కవి నేలపూరి రత్నాజీ తెలిపారు. తొలి దళిత కవి, జాతీయోద్యంలో పాల్గొని మహాత్మాగాంధీ అభిమానం పొందిన కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా జరిగే సాహిత్య సమావేశానికి రచయిత్రి, నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి, బహుజన రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నూకతోటి రవికుమార్, ప్రజాశక్తి ఎడిటర్ సత్యాజీ హాజరవుతారని చెప్పారు.

జనసేనలో ప్రక్కిలంక ఉప సర్పంచ్ చేరిక


విత్తం నానికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు

తాళ్లపూడి / కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక ఉపసర్పంచ్ విత్తం వీర వెంకట సత్యనారాయణ (నాని) శుక్రవారం వైసీపీను వీడి జనసేన పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొలిశెట్టి అబ్బులు, సిద్ధారామకృష్ణ పాల్గొన్నారు.